

డీసీపీ-2గా మేరీప్రశాంతి

- అనకాపల్లి ఎస్పీగా తుహిన్ సిన్హా
- జాయింట్ సీపీ ఫకీరప్పకు బదిలీ

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ-2గా డి.మేరీప్రశాంతిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం డీసీపీ-2గా పనిచేస్తున్న తుహిన్ సిన్హాను అనకాపల్లి ఎస్పీగా బదిలీ చేసింది. అలాగే జాయింట్‌సీపీగా పనిచేస్తున్న కె.ఫకీరప్పను ఇంటెలిజెన్స్ ఎస్పీగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

ఆర్థిక రాజధానిగా విశాఖ

ప్రపంచ డేటా హబ్‌గా అభివృద్ధి చేస్తాం

- 15 రోజుల్లో అంతర్జాతీయ కార్గో రవాణా ప్రారంభం
- మెట్రో రైలు ప్రాజెక్టును కూడా పట్టాలెక్కిస్తాం
- పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది ఆసక్తి
- చర్చలు జరుపుతున్నాం... త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తాం
- ఐటీ కంపెనీల బకాయిలు క్లియర్ చేస్తాం
- ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్



నోవాటెల్ హోటల్‌లో బుధవారం జరిగిన సీఐఐ సదస్సులో మంత్రి నారా లోకేశ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఐఐ ప్రతినిధి డాక్టర్ మురళీకృష్ణ. చిత్రంలో రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దనరెడ్డి, ఎంపీ ఎం.శ్రీభరత్ ఉన్నారు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):
విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా మారుతుందని, మూడు ట్రిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. సీఐఐ నోవాటెల్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. పారిశ్రామికవేత్తలు పారిపోయే పరిస్థితి తెచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. పరిస్థితులను చక్కదిద్ది మళ్లీ అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు యత్నిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి వంటి సైకోలు సీఎంలు అయితే ఏమి జరుగుతుందో ప్రజలు తెలుసుకున్నారు కాబట్టి ఇకపై జాగ్రత్తగా ఉండాలన్నారు. విశాఖ నుంచి విదేశాలకు విమానాల ద్వారా సరకు పంపించుకునే సౌలభ్యం ఉండేదని, జగన్ హయాంలో అది కూడా పోయిందన్నారు. పదిహేను రోజుల్లో సరకు రవాణాకు చర్యలు చేపడతామన్నారు. విశాఖను ప్రపంచానికే డేటా హబ్‌గా మారుస్తామన్నారు. విశాఖపట్నం ఇప్పటికే ఐటీ డెస్టినేషన్‌గా మారిందని, ఫార్మా హబ్‌గా ఉందని, పెట్రో కెమికల్ కారిడార్ కూడా ఉందని, మరో వైపు నేవీ ఉందని, త్వరలో భోగాపురం విమానాశ్రయం కూడా అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోతాయన్నారు. విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టును కూడా పట్టాల పైకి తెస్తామన్నారు. పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఉన్నందున డెడికేటెడ్ కారిడార్ ఉండాలని, దానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తులో తక్కువ ధరకే విద్యుత్ లభిస్తుందని, అప్పుడు ఇక్కడికి రావడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారన్నారు. విశాఖలో పెట్టుబడులకు అనేక మంది ఆసక్తిగా ఉన్నారని, కొంతమంది పారిశ్రామికవేత్తలు కూడా వచ్చారని, వారితో కలిసి క్షేత్ర పరిశీలన చేస్తామన్నారు. అనేక మంది చర్చలు జరుపుతున్నామని, వాటి ఫలితాలు ఏమిటో త్వరలో వెల్లడిస్తామన్నారు. వంద రోజుల్లో ఐటీ పాలసీ ప్రకటిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఐటీ కంపెనీలకు ఒక్క రూపాయి కూడా రాయితీ ఇవ్వలేదని, ఆ బకాయిలన్నీ త్వరలో క్లియర్ చేస్తామని చెప్పారు.

ఎలివేటెడ్ కారిడార్‌తో ఫ్లైఓవర్ల అనుసంధానం: శ్రీభరత్, ఎంపీ

ఈ సదస్సులో పాల్గొన్న విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, సిటీ నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లడానికి ట్రాఫిక్ వల్ల చాలా సమయం పడుతుందన్నారు. ఇందుకోసం 12 ఫ్లైఓవర్లు నిర్మించాలనే ప్రతిపాదన ఉందన్నారు. అయితే మెట్రో రైలు ప్రాజెక్టు కూడా ఉన్నందున ఈ రెండింటికి ఉపయోగపడేలా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారని, ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారని చెప్పారు. ఎలివేటెడ్ కారిడార్‌లో మూడు చోట్ల ఫ్లైఓవర్లకు కనెక్టివిటీ ఉంటుందన్నారు. ఈ డిజైన్ కొంత క్లిష్టమైనదని అభిప్రాయపడ్డారు. విశాఖలో భూగర్భ కేబుల్ వ్యవస్థ కొంత మేరకు ఉందని, త్వరలోనే నగరం అంతా వేస్తారని, అయితే పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్‌ను ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ వ్యయం తగ్గుతుందని సూచించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం 18 నెలల్లోనే పూర్తవుతుందని చెప్పారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

ఉమ్మడి జిల్లా కూటమి ప్రజా ప్రతినిధులతో మంత్రి నారా లోకేశ్ భేటీ

- స్టీల్‌ప్లాంటు అంశంపైనే ప్రధానంగా చర్చ
- సెయిల్‌లో విలీనం చేస్తే బాగుంటుందన్న కొందరు ఎమ్మెల్యేలు
- కేంద్రంతో వీలైనంత త్వరగా చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరిన పలువురు నేతలు
- కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్న యువనేత
- కార్మికుల కళ్లలో ఆనందం చూడాలనే దృఢ సంకల్పంతో కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నట్టు వెల్లడి


నగరంలోని రాడిసన్ హోటల్‌లో బుధవారం సాయంత్రం ఉమ్మడి జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశమైన మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):
విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందామంటూ ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులు తీర్మానించారు. కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. బుధవారం సాయంత్రం రుషికొండలోని రాడిసిన్ బ్లూ హోటల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన కూటమి ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా విశాఖ ఉక్కు కర్మాగారం అంశంపైనే చర్చ జరిగింది. అందరూ తమ తమ అభిప్రాయాలు వ్యక్తపరచారు. ప్రస్తుతం కర్మాగారంలో ఒక్కొక్క యూనిట్‌ను మూసివేస్తున్నారని, ఉద్యోగులను డిప్యుటేషన్‌పై బయటకు పంపుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటువంటి పరిస్థితుల్లో కర్మాగారాన్ని కాపాడుకునేందుకు కేంద్రంతో చర్చించాలని కోరారు. ఇప్పుడున్న సంక్షోభం నుంచి బయటపడి కర్మాగారం సజావుగా నడవాలంటే ఉక్కు దిగ్గజం సెయిల్‌లో విలీనం చేయడం ఒక్కటే మార్గమని కొందరు అభిప్రాయపడ్డారు. 32 మంది బలిదానంతో ఏర్పడిన కర్మాగారం ఆంధ్రుల సెంటిమెంట్‌కు సంబంధించిందని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాలని ఉద్దేశంతో ఉన్నారన్నారు.

సెయిల్‌తో సంబంధం లేకుండా కేంద్రం నుంచి భారీగా రుణం తీసుకుని కర్మాగారాన్ని నడిపితే ఎలా ఉంటుందని కొందరు ప్రస్తావించగా మరికొందరు పలు సందేహాలు వ్యక్తంచేశారు. కేంద్రం ఇచ్చిన నిధులతో సజావుగా ప్లాంటు నడిపితే ఫర్వాలేదని..రెండు, మూడేళ్ల తరువాత నిధుల సమస్య మళ్లీ మొదటకు వస్తే అప్పుడు పరిస్థితి ఏమిటని ... మిగతా 6వ పేజీలో

నేడు అప్పన్నను దర్శించుకోనున్న లోకేశ్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ గురువారం ఉదయం ఆరున్నర గంటలకు సింహాచలం వరాహనరసింహస్వామి దేవాలయానికి వెళ్లి స్వామిని దర్శించుకుంటారు. ఆ తరువాత ఉదయం తొమ్మిది గంటల నుంచి పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారు. వీలునుబట్టి కార్యకర్తలతో సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. తరువాత నగరంలో మునిసిపల్ పాఠశాలలను సందర్శిస్తారు. అయితే దీనికి సంబంధించి ఎటువంటి సమాచారం బయటకు చెప్పలేదు. జిల్లా విద్యాశాఖకు కూడా సమాచారం ఇవ్వలేదు. నగరంలో పాఠశాలల వివరాలు ఇప్పటికే సేకరించిన లోకేశ్, ఆకస్మికంగా ఒకటి, రెండు పాఠశాలలను సందర్శించవచ్చునంటున్నారు.

కౌన్సిల్‌లో సమస్యలు ఏకరువు

వీధి దీపాలు, తాగునీటి సరఫరాలో ఇబ్బందుల గురించి అత్యధికుల ప్రస్తావన

- తమ వార్డుల్లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని జీవీఎంసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురి ఫిర్యాదు
- క్లాప్ వాహనాల లోడర్ల నియామకంలో డబ్బులు వసూలు చేసారంటూ 70వ వార్డు కార్పొరేటర్ ఆరోపణ
- తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ మేయర్‌తో 31వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్ వాగ్వాదం
- అసభ్యకరంగా మాట్లాడడంతో సభ నుంచి సస్పెండ్ చేసిన మేయర్
- యూసీడీ కుంభకోణంపై విచారణకు కమిషనర్ హామీ
- పలుమార్లు కూటమి, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం
- రాత్రి పది గంటలు వరకూ సాగిన కౌన్సిల్ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లంతా తమ వార్డుల్లోని సమస్యలను ఏకరువుపెట్టారు. తొమ్మిది నెలలు తర్వాత జరుగుతున్న సమావేశం కావడంతో సమస్యలను అధికారులు దృష్టికి తెచ్చేందుకు జీరో అవర్ ఇవ్వాలని కార్పొరేటర్లంతా మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కోరారు. అయితే జీరో అవర్ ప్రకటించిన వెంటనే యూసీడీ కుంభకోణంపై టీడీపీ సభ్యుడు రాపర్తి కన్నారావు మాట్లాడడం, మేయర్‌కు కూడా అందులో వాటా ఉందని అభియోగం చేయడం, ఆమె రాజీనామాకు సభ్యులు డిమాండ్ చేయడంతో సభ బుధవారానికి వాయిదాపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్పొరేటర్లు తమ సమస్యలు చెప్పుకునేందుకు బుధవారం అవకాశం కల్పించారు.


కూటమి నేతలతో వైసీపీ కార్పొరేటర్ల వాగ్వాదం


జనసేనకు చెందిన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలని మేయర్‌ను కోరుతున్న కూటమి సభ్యులు

ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే యూసీడీ కుంభకోణాన్ని టీడీపీ కార్పొరేటర్ రాపర్తి కన్నారావు మళ్లీ ప్రస్తావిస్తూ ఎటువంటి చర్యలు తీసుకుంటారో కమిషనర్ వివరణ ఇవ్వాలని కోరారు. కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ దీనిపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరపాలని కోరతానని హామీ ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్ల కోర్కె మేరకు జీరో అవర్ కింద ప్రతి సభ్యుడు తన వార్డులోని సమస్యలను వివరించేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. కార్పొరేటర్లంతా తమ వార్డుల్లో వీధిలైట్లు వెలగడం లేదని, వీధి కుక్కల సమస్య ఉందని, నీటి సరఫరాలో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నందున కొత్తబోర్లు మంజూరుచేయాలని ... మిగతా 6వ పేజీలో

హార్టీకల్చర్‌లో అక్రమాలపై నిలదీత

వివరణ ఇవ్వడానికి నీళ్లు నమిలిన అధికారి

- ఎజెండాలో 14 అంశాలపై చర్చ...11 ఆమోదం
- మిగిలిన అంశాలపై చర్చించేందుకు నేడు కౌన్సిల్ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):
జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఎజెండాపై చర్చ సందర్భంగా అధికారుల అవినీతి, అక్రమాలపై సభ్యులు నిలదీశారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు నీళ్లు నమలారు. బుధవారం కౌన్సిల్ సమావేశంలో జీరో అవర్ అనంతరం రాత్రి ఎనిమిది గంటలకు ఎజెండాపై చర్చ ప్రారంభిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. 14 అంశాలపై చర్చ జరగ్గా 11 అంశాలను ఆమోదించారు. మరో మూడింటిని వాయిదా వేశారు. అప్పటికే రాత్రి పదిన్నర కావడంతో మహిళా కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు ఎజెండాలోని మిగిలిన అంశాలపై గురువారం మధ్యాహ్నం చర్చ జరపాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి నిర్ణయించారు.

ఎజెండాపై చర్చ ప్రారంభమైన తర్వాత హార్టీకల్చర్ విభాగంలో పనిచేస్తున్న 40 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ మరో ఏడాది కొనసాగించే ప్రతిపాదనపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ హార్టీకల్చర్ విభాగంలో తక్కువ మంది పనిచేస్తున్నప్పటికీ, ఎక్కువ మంది పనిచేస్తున్నట్టు చూపించి జీతాలు డ్రా చేస్తున్నారని ఆరోపించారు. జీ-20 పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ హార్టీకల్చర్ విభాగం పనుల్లో ఇద్దరు ... మిగతా 6వ పేజీలో

ఇదీ ఫ్రిజ్ పరిస్థితి


ఇదేమి ల్యాబ్!

ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో అత్యంత దారుణమైన పరిస్థితులు

- తుప్పు పట్టిన ఫ్రిజ్
- గడువు ముగిసిన కెమికల్స్‌తో పరీక్షలు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):
నగరంలో గల ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో అధ్వాన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ల్యాబ్‌లో ఒక్క పరికరం కూడా పనిచేసే స్థితిలో లేకపోయినప్పటికీ సిబ్బంది మాత్రం ఎంచక్కా పరీక్షలు నిర్వహించి రిపోర్టులు ఇచ్చేస్తున్నారు. ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాలంటే తప్పనిసరిగా కెమికల్స్ వినియోగించాల్సి ఉంటుంది. అయితే, గడువు ముగిసిన కెమికల్స్‌ను ఇక్కడి సిబ్బంది పరీక్షలకు ఉపయోగిస్తున్నారు. ఈ కెమికల్స్‌ను నిల్వ చేసేందుకు వినియోగించే ఫ్రిజ్ అత్యంత దారుణంగా ఉంది. పూర్తిగా తుప్పు పట్టి, పురుగులు చేరి కనిపిస్తోంది. ఇందులో కొన్ని కెమికల్స్ కూడా పురుగులు పట్టి ఉన్నాయి. వీటితోనే పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. బిస్కెట్లు, గోధుమపిండి వంటి వాటిలో తేమ శాతాన్ని



ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల

తెలుసుకునేందుకు వినియోగించే హాట్ ఎయిర్ ఒవెన్‌లు పూర్తిగా పాడయ్యాయి. అలాగే ఇతర ఆహార పదార్థాల్లో కల్తీని నిర్ధారించేందుకు వినియోగించే మఫ్ల ఫర్నేస్, పాలలో వెన్నశాతం వంటివి తెలుసుకునేందుకు వినియోగించే సెంట్రీఫ్యూజ్, టీ పౌడర్, చిల్లీ పౌడర్ వంటి వాటిలో తేమశాతాన్ని తెలుసుకునేందుకు వినియోగించే థర్మో స్టాట్ పరికరం పాడయ్యాయి. అయినప్పటికీ ఇక్కడి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఏ పరికరాలను వినియోగించి పరీక్షలు చేస్తున్నారో అధికారులకే తెలియాలి.

మూన్నాళ్ల ముచ్చటగా బస్‌బేలు



నగరంలో ఆట్టాహాసంగా ప్రారంభించిన బస్‌బేల వెలుగులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. నగరంలో 20 చోట్ల సుమారు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ వెచ్చించి స్మార్ట్ బస్‌బేలను జీవీఎంసీ నిర్మించింది. ఆకర్షణీయంగా ఎలివేషన్, లైటింగ్, అయా ప్రాంతాలను తెలియజేసేలా నామఫలకాలను ఏర్పాటుచేసింది. ప్రారంభించి ఆరు నెలలు గడవకుండానే బస్‌బేలన్నీ నిర్వహణలోపంతో పాడైపోతున్నాయి. అక్కయ్యపాలెం పోర్ట్ ఆస్పత్రి సమీపంలోని బస్‌బే అయితే నామఫలకం, ఎలివేషన్ ఊడిపోవడంతోపాటు లైట్లు వెలగకపోవడంతో నామరూపాల్లేకుండా పోయింది.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

వాయు కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు

మహారాణిపేట, సెప్టెంబరు 25: జిల్లాలో వాయు కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. 'జాతీయ స్వచ్ఛమైన వాయువు' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న చర్యలపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోనూ, నగర పరిధిలో వాయు కాలుష్య కారకాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు, గాలి నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. నగరంలో అత్యంత రద్దీ ప్రాంతాలను గుర్తించి వాయు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర రాష్ట్ర కాలుష్య నియంత్రణ, జీవీఎంసీ, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మన్యం ధీరుడు'కు పన్ను మినహాయింపుపై మంత్రికి వినతి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 25: మన్యం ధీరుడు చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్లు తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు.నగరానికి వచ్చిన మంత్రిని బుధవారం కలిసి పలు విషయాలపై వినతిపత్రం అందజేశామన్నారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు న్యాయం చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీవీఎంసీ ఉద్యానవన విభాగంలో అక్రమాలు సహా పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ అవకాశం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 25: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలోని కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడపై ఉన్న సంస్థ కార్యాలయంలో అక్టోబరు 1 నుంచి నవంబరు 30 వరకు ఉదయం 10 నుంచి 11-30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత శిక్షణ కోసం ఆసక్తి గల గృహిణులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8019388999 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఫార్మాసిస్ట్ డే వేడుకలు



ఫార్మశీ అభ్యర్థులతో ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు, అధ్యాపకులు

కంచరపాలెం, సెప్టెంబరు 25: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఫార్మశీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఫార్మాసిస్ట్ డే సందర్భంగా కళాశాలలో ఈ కోర్సు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సత్కార సభకు ఏపీ రాష్ట్ర ఫార్మశీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డా.విలియం క్యారీ హాజరై ఫార్మాసిస్టుల ప్రాధాన్యాన్ని వివరించారు. వైద్యరంగంలో ఎంతో ఉపయోగకరమైన వ్యక్తులు ఫార్మాసిస్టులని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఫార్మశీ విభాగాధిపతి గోవర్ధన్, అధ్యాపకులను ముఖ్య అతిథి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరానగర్-3 నూతన కమిటీ ఎన్నిక

కంచరపాలెం, సెప్టెంబరు 25: జీవీఎంసీ 48వవార్డు పరిధి ఇందిరానగర్-3 గ్రామ కమిటీ ఎన్నికల్లో నూతన సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ టీడీపీ నాయకుడు సత్యాడ అప్పారావు, కార్యదర్శిగా మహేశ్వరావు, కోశాధికారిగా దారా చినబాబు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. నూతన కమిటీని కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు అభినందించారు.

ఉత్పత్తుల నాణ్యతపై అవగాహన కల్పించాలి

మహారాణిపేట, సెప్టెంబరు 25: వినియోగదారుల రక్షణ, ఉత్పత్తుల నాణ్యత, ప్రజలకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించేందుకు కృషిచేయాలని ఆర్ఐఎన్ఎల్ వైజాగ్ స్టీల్ జనరల్ మేనేజర్ రుచిరా గుప్తా తెలిపారు విశాఖలోని హోటల్ గ్రీన్ పార్కులో బుధవారం మనక్ మహోత్సవ్ ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ బీఎస్ఐ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నాణ్యతా ప్రమాణాల నిర్వహణ కోసం కృషి చేస్తుందని తెలిపారు విద్యావినియోగ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు, ఆధునిక సాంకేతికత ద్వారా రాష్ట్రంలో నాణ్యమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పరిశ్రమలకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఐ రాష్ట్ర విభాగాధిపతి వినోద్, ఐఐఎమ్ ప్రొఫెసర్ దీపికాగుప్తా, పరిశ్రమలు, విద్యాసంస్థలు, శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

31వ వార్డులో రోడ్డుపైనే చెత్త

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 25: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ప్రాంతాల్లోని పారిశుధ్యం అధ్వానంగా మారింది. వార్డులో పలు ప్రాంతాల్లోని మధ్యాహ్నం వరకు చెత్తను తొలగించడంలేదు. దీంతో ఆయా రహదారుల్లో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రంగాస్ట్రీట్‌లో పెద్ద చెత్త కుప్పను రోడ్డుపైనే వదిలేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి సమస్య లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వాహనాల జోరు.. అదుపు చేసేవారు లేరు!

» ట్రాఫిక్ నియంత్రణలో నిర్లక్ష్యం » ఆర్‌అండ్‌బీ కూడలిలో జనం బేజారు



ట్రాఫిక్ కానిస్టేబుల్ లేకపోవడంతో ఎవరికి నచ్చినట్టుగా వారు వెళ్లిపోతున్న వాహనదారులు



ఖాళీగా ఉన్న ఆర్‌అండ్‌బీ జంక్షన్ ట్రాఫిక్ క్యాబిన్



కూడలిలో మూడు మార్గాల్లో ఒకేసారి వెళ్లిపోతున్న వాహనాలు

మురళీనగర్, సెప్టెంబరు 25; విశాఖ ఉత్తరంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ పూర్తిగా గాలి కొదిలేశారు. ఈ నాలుగు రోడ్ల కూడలిలో గత పది రోజులుగా సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. దీంతో వాహనాలు అడ్డు-అదుపు లేకుండా దూసుకొస్తున్నాయి. అటు మర్రిపాలెం ఉడా లేఅవుట్... ఇటు మాధవధార అంబేడ్కర్‌కాలనీ, కేవీస్సార్ గ్రీన్ వ్యాలీ వైపు వచ్చే వాహనాలు హైవే దాటి రాకపోకలు సాగించాలి. హైవే నాలుగు వరుసల్లో మరో ప్రధానదారి నేరుగా ఎన్ఏడీ వైపు ప్రయాణించే వాహనాలు, ఇటు కంచరపాలెం వైపు వెళ్లే భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ఈ జంక్షన్ రద్దీగా ఉంటుంది. నాలుగు వైపులా ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పరిసరాల్లో 20 వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. ఈ కారణంగా ఉదయం వేళ ఇక్కడ వాహన రాకపోకలు జాతరను తలపిస్తుంటాయి. తిరిగి సాయంత్రం కూడా అంతకు మించి వాహనాలు వేగంగా ప్రయాణిస్తుంటాయి. ఎన్ఏడీ జంక్షన్ దాటిన తర్వాత అంత ప్రాధాన్యమున్న ఆర్‌అండ్‌బీ కూడలిలో వాహనాల్ని నియంత్రణ లేకుండా వదిలేస్తున్నారు. పక్కనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, చిత్రంగా ఈ ఆర్‌అండ్‌బీ జంక్షన్‌లోనే కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషను కూడా ఉంది. సర్కిల్ ఇన్‌స్పెక్టరు కార్యాలయం, ఎస్ఐలు, సిబ్బంది ఇక్కడి ఎయిర్‌పోర్ట్ పోలీసు స్టేషన్ నుంచే విధులకు చేరుకుంటారు. వారి కంటపడినా ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ తిప్పలు పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. చూసీచూడనట్లు ట్రాఫిక్ బుల్లెట్స్, రక్షక్ వాహనాలేసుకుని ఇదే సిగ్నల్ పాయింట్ మీదుగా వెళుతుంటారు. కానీ జంక్షన్‌లో ప్రయాణికులకు సాయపడటం లేదు. వారి ఉద్యోగ ధర్మం కూడా నెరవేర్చడం లేదని ప్రయాణికులు, ఈ ప్రాంతాల నివాసితులు పెదవి విరుస్తున్నారు.

బందోబస్తుకు వెళ్తే అంతేసంగతి: నగరంలో బుధ, గురువారాల్లో మంత్రి లోకేశ్ పర్యటన కారణంగా ఉన్న పోలీసులంతా ఆ మీటింగ్ జరిగే ప్రాంతంలోనే విధుల్లోకి వెళ్లిపోవడంతో క్యాబిన్లు ఖాళీ అయిపోయాయి. బిర్లా జంక్షన్, ఊర్వశి జంక్షన్ లాంటి రద్దీ ప్రాంతాల్లోనూ బుధవారం సిబ్బంది నామమాత్రంగా విధుల్లో కనిపించారు. నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉన్నా, ఉత్సవాలు, ప్రమాదాలు జరిగినా పోలీసులంతా ప్రత్యేక విధుల్లో వెళ్తున్నపుడు కనీసం ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పనిచేసినా వాహనదారులకు, పాదచారులకు కనీస రక్షణ లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇకనైనా, ట్రాఫిక్ వెతలు పరిష్కరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదం ప్రజలకు పరమ పవిత్రం

» డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మహాయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ వ్యాఖ్య



వేంకటేశ్వర స్వామి విగ్రహానికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 25 తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరమ పవిత్రంగా భావిస్తారని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన నగర అధ్యక్షుడు సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా బుధవారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ కూడలి వద్ద మహాయాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి సెట్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి నామాలు ధరించారు. అనంతరం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దీక్ష, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ తిరుమల ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీని కలలో కూడా ఊహించలేమన్నారు. భక్తులంతా...స్వామివారిని చూసి ఎంత తన్మయం పొందుతారో... శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించి అంతే ఆనందాన్ని వ్యక్తం చేస్తారన్నారు. విదేశాల్లో సైతం తిరుమల శ్రీవారు, లడ్డూ కోసం నిత్యం మాట్లాడుకోవడం మనమంతా చూస్తుంటామన్నారు. ఈ ఘటనపై ప్రతి ఒక్కరిలో తీవ్ర ఆవేదన ఉందన్నారు. డిప్యూటీ సీఎం చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలియజేయడం మనందరి బాధ్యత అన్నారు. గురువారం నుంచి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. టీడీపీ సౌత్ ఇన్‌చార్జ్ ఎస్.సుధాకర్, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైరుతో హైటెన్షన్!



మాధవధార సర్వీసురోడ్డు మధ్య తెగిపడిన విద్యుత్ వైరు

మాధవధార, సెప్టెంబరు 25; నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ హైటెన్షన్ వైరు తెగిపడింది. బాటసారులు అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదం తప్పింది. గ్రేటరు 51వ వార్డు మాధవధార హైవే సర్వీసు రోడ్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆర్టీఏ కార్యాలయం రోడ్డు దిగువగా జీఎస్ఐ కార్యాలయానికి సరఫరా అందిస్తున్న వైరు తెగిపడిన విషయాన్ని స్థానికులు గుర్తించి ఆ శాఖకు సమాచారం ఇవ్వడంతో తక్షణమే సరఫరా ఆపి వేసిన ఎస్ఎస్‌టీఎల్ మాధవధార విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. వేలాడుతున్న వైరును గమనించని వాహనదారులు తొలుత దగ్గరగా వచ్చి, భయపడి వాహనాల్ని మళ్లించి జాగ్రత్తగా పక్కకు మళ్లడంతో ప్రమాదం తప్పింది. వైరు తెగిపడిన సమయంలోనూ వాహన రాకపోకలు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఓవైపు జోరువాన.. నీరు చేరిన రోడ్డులో తొలుత కరెంటు హైటెన్షన్ వైరు చూసి పాదచారులు, వాహనదారులు ఉలిక్కిపడ్డారు. ఎస్ఎస్‌టీఎల్ విద్యుత్ కార్యాలయ సహాయక ఇంజనీరు అప్పలరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వైర్లు తొలగించారు.

50వ వార్డులో స్వచ్ఛతాహి సేవ

మాధవధార; గ్రేటరు 50వ వార్డు పరిధి తెన్నేటినగర్‌లో బుధవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. జోన్-5 ఏఎంహెచ్ఓ సునీల్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టరు సుధాకర్, వార్డు టీడీపీ అధ్యక్షుడు వరప్రసాద్ పాల్గొని స్థానికులకు స్వచ్ఛపరిసరాల ఆవశ్యకతను వివరించారు. తెన్నేటి విశ్వనాథం పార్కు పరిసరాల్ని శుభ్రపరచి రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తెన్నేటి విశ్వనాథం సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావ పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 25: పాఠశాల దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకరరావు సూచించారు. 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో ప్రపంచ శాంతి దినోత్సవం పురస్కరించుకుని నార్త్ ఈస్ట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు అందుకున్నారు. పలు అంశాలపై చిత్రలేఖనాలు గీసి ఆకట్టుకున్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఉషాకిరణ్

దొండపర్తి, సెప్టెంబరు 25: జనసేన పార్టీ రాష్ట అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, జనసైనికులు దొండపర్తి ప్రధాన రహదారిలో ఉన్న ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం సాయంత్రం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉషాకిరణ్ మాట్లాడుతూ ఇతర మతాలను గౌరవిస్తూనే హైందవ సంస్కృతి, సంప్రదాయాలకు, హిందువుల మనోభావాలకు భంగం కలిగినప్పుడు అందరూ రోడ్లపైకి వచ్చి సంఘటితంగా తమ నిరసన తెలియజేయాలని పవన్ కల్యాణ్ చెబుతున్నారన్నారు. మానవ తప్పిదాలకు ప్రళయాలు, ప్రకృతి వైపరీత్యాలు రాకుండా భగవంతుడిని శరణు వేడుదామని అంటుంటే, సినీ నటుడు ప్రకాష్‌రాజ్ అపహాస్యం చేయడం తగదన్నారు. తిరుపతి లడ్డు అపవిత్రం చేసిన వారిపై సిట్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమన్వయకర్తలు దుర్గ, త్రివేణి, సుధ, నాగలక్ష్మి, వీర మహిళలు నాగమణి, పార్వతి, శ్యామల, కళ, రేఖ, లక్ష్మి పాల్గొన్నారు.

పండిత్ దీనదయాల్‌కు ఘననివాళి

సీతమ్మధార, సెప్టెంబరు 25: సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో బుధవారం పండిత్ దీనదయల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు దీన దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం కన్వీనర్ సురేష్‌బాబు, పృథ్వీరాజ్, శంకరరావు, పోతురాజు, రాకేష్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 42వ వార్డులో బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం పండిత్ దీన్ దయాల్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం బీజేపీ ఇన్‌చార్జ్ ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, రాజగిరి కృష్ణ, 42వ వార్డు ప్రధాన కార్యదర్శి ఎ.ఆచారి, వెంకటరావు, రత్నం, శ్రీదేవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్లెలు, మందారాలు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, ఇతర అతిథులు

సీతంపేట, సెప్టెంబరు 25: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో భాగవతుల కృష్ణారావు రచించిన కథా సంపుటి మందారాలు, భాగవతుల సత్యనారాయణ మూర్తి రచించిన కథా సంపుటి మల్లెలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్ ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ రచయితలు మందారాలు, మల్లెల పరిమళాలను తమ కవితల ద్వారా లోకానికి అందించారన్నారు. ఈ పుస్తకాలు మన సామాజిక ఇతివృత్తాలను ప్రతిబింబించే కథలన్నారు. కథలు సమాజ పరివర్తనకు దోహదపడాలన్నారు. రచయిత, విశ్లేషకులు డాక్టర్ డి.వి. సూర్యారావు మందారాలు కథాసంపుటిని సమీక్షిస్తూ కృష్ణారావు కథలు సంప్రదాయ పరిమళంతో సామాజిక రుగ్మతలకు పరిష్కారం చూపించగలవన్నారు. రచయిత డాక్టర్ కె.జి.వేణు మల్లెలు క థా సంపుటిని సమీక్షిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా రచయితలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూరపనేని విజయ్‌కుమార్, చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.సుబ్రహ్మణ్యం, ఎం.సుబ్బారావు, గౌరీపతి శాస్త్రి, కొత్తూరు రమణ, బి.రాధారాణి, తనికెళ్ళ సూర్యకళ, డాక్టర్ కెవిఎస్ మూర్తి, పరమేశ్వరరావు, శ్రీనివాసరావు, డీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

... 5వ పేజీ తరువాయి

మరికొందరు సందేహం వ్యక్తంచేశారు. కర్మాగార యాజమాన్యం ఒంటెత్తు పోకడలు, కార్మికుల్లో కొందరి ప్రవర్తనపై కూడా ప్రజల్లో అపోహలు ఉన్నాయని కొందరు అన్నారు. అందువల్ల పటిష్టమైన యాజమాన్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర పరిధిలో ఉన్న భూములు మొత్తం బదిలీ చేస్తే బ్యాంకులు నుంచి రుణం తీసుకుని కర్మాగారానికి నడుపుకోవచ్చునని సమావేశంలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఏదోవిధంగా కర్మాగారాన్ని నిలబెట్టుకోవాలని, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నివేదిక రూపంలో సమర్పించాలని తీర్మానించారు. చంద్రబాబు ద్వారా కేంద్రంతో చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలని, అందుకు కాలయాపన కాకుండా సత్వరమే చర్యలు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ విశాఖపై తనకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. పాదయాత్ర సమయంలో ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చానని గుర్తుచేశారు. విశాఖ ఉక్కుతో ప్రతి తెలుగువాడికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, హైదరాబాద్‌లో తమ ఇంటికి విశాఖ ఉక్కు స్టీల్ వాడామన్నారు. కర్మాగారాన్ని వెంటాడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి కార్మికుల కళ్లల్లో ఆనందం చూడాలనే దృఢ సంకల్పంతో కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నామని అన్నారు. అందరికీ ఆమోద్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు నివేదిస్తామన్నారు. కేంద్రంతో సీఎం చర్చించి ఉక్కు కర్మాగారంపై ఒక నిర్ణయం తీసుకుంటారని లోకేశ్ వెల్లడించారు. రానున్న రోజుల్లో మిగతా సమస్యలపై చర్చించుకుని నిర్ణయాలు తీసుకుందామన్నారు. అందరూ కూర్చుని చర్చించుకుంటే పరిష్కారం కాని సమస్య ఉండదన్నారు. సమావేశంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, కోండ్రు మురళి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, టీడీపీ పెందుర్తి, విశాఖ దక్షిణ ఇన్‌చార్జులు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, సెయిల్ డైరెక్టర్, బీజేపీ నాయకుడు కాశీవిశ్వనాథరాజు పాల్గొన్నారు.

అదానీకి కేటాయించిన కొండను సందర్శించిన లోకేశ్

మధురవాడ పనోరమ హిల్స్‌కు ఆనుకుని అదానీ డేటా సెంటర్‌కు కేటాయించిన కొండ ప్రాంతాన్ని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ బుధవారం సాయంత్రం సందర్శించారు. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

కౌన్సిల్‌లో సమస్యలు ఏకరువు

... 5వ పేజీ తరువాయి

కోరారు. కరెంట్ స్తంభాలు ఏర్పాటుచేయకపోవడం, లైట్లు అమర్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు రెండో వార్డు కార్పొరేటర్ గాడుచిన్నికుమారి వివరించారు. నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలుపల్లి ఏడుకొండలు మాట్లాడుతూ తమ వార్డులో సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రతించాలో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. తన వార్డు పరిధిలోని సర్వేనంబర్ 314లో మూడు వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తొమ్మిదో వార్డు కార్పొరేటర్ స్వాతీదాస్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో సర్వేనంబర్ 143/2లోని లేఅవుట్‌లో 57 సెంట్లు ప్రభుత్వం స్థలం ఉందని దానిని నకిలీ డాక్యుమెంట్లతో కబ్జాకు ఇద్దరు యత్నిస్తున్నారని దీనిపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ స్వర్ణభారతి స్టేడియం పనులు ఎప్పటికి పూర్తవుతాయో అర్థం కావడం లేదని, దీనివల్ల క్రీడాకారులు, వాకర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆవరణలోకి పశువులు వెళ్లినప్పుడు జీవీఎంసీ అధికారులు వాటి యజమానుల నుంచి డబ్బులు తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపించారు. ఆ సమయంలో వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు కలుగజేసుకుని 'నువ్వో క్రిమినల్‌వి' అనడంతో సభలో గందరగోళం ఏర్పడింది. పరుష పదజాలంతో కార్పొరేటర్‌ను దూషించిన బాణాలను సస్పెండ్ చేయాలని కూటమి కార్పొరేటర్లు పట్టుబట్టారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు సర్దిచెప్పారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ మేయర్‌తో 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్ వాగ్వాదానికి దిగారు. సీట్లో కూర్చోవాలని మేయర్‌తోపాటు ఇతర వైసీపీ సభ్యులు సూచించినా పట్టించుకోకుండా, తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని, లేనిపక్షంలో సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో మాట్లాడేందుకు మేయర్ అవకాశం కల్పించారు. తన వార్డు పరిధిలోని ఫుడ్‌కోర్టును తొలగిస్తామని ఏడాదిన్నర కిందట తీర్మానం చేసినా ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ క్రమంలో అసభ్యపదజాలం ప్రయోగించడంతో ఆయన్ను సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో అక్రమాలే జరిగాయని, సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అనడంతో వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు జోక్యం చేసుకుని ఏదో మాట్లాడబోయారు. ఈ సమయంలో 'నువ్వొక డస్ట్‌బిన్' అని బాణాలను ఉద్దేశించి కంపా హనోక్ అనడంతో వివాదం తలెత్తింది. 'నీది టీడీఆర్ కుంభకోణం, నువ్వు బేవర్స్' అని బాణాల తిరిగి హనోక్‌ను అనడంతో ఇద్దరి మధ్య వాగ్వారం జరిగింది. బాణాలపై దాడికి హనోక్ దూసుకురాగా మిగిలిన సభ్యులు అడ్డుకున్నారు. 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ తన వార్డు పరిధిలో రోడ్లు ఇష్టారాజ్యంగా తవ్వేసి వదిలేస్తున్నారని, చీకట్లో ఆ గోతుల్లో పడి ఎంతోమంది ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇటీవల చెట్టివానిపాలెంలో 18 ఏళ్ల యువకుడు గోతిలోపడి మృతిచెందాడని ఆవేదన వ్యక్తంచేశారు. 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చంద్రరావు మాట్లాడుతూ క్లాప్ వాహనాలకు చెత్తలోడింగ్ చేసేందుకు 650 మందిని కాంట్రాక్టర్ ద్వారా నియమించుకున్నారని, ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేసి ఉద్యోగాల్లో పెట్టుకున్నారని ఆరోపించారు. 76వ వార్డు కార్పొరేటర్ గందం శ్రీనివాసరావు మాట్లాడుతూ తన వార్డు పరిధిలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేటు వ్యక్తి ఆక్రమించుకుని ఆవులను పెంచుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. తక్షణం ఆ భూమిని జీవీఎంసీ పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నైట్‌ఫుడ్‌కోర్ట్ పేరుతో ఏటా రూ.145 కోట్లు వసూలు చేస్తున్నారని, ఆ డబ్బులు ఎవరు వసూలు చేస్తున్నారు? జీవీఎంసీకి ఎంత చేరుతోందనే దానిపై వివరణ ఇవ్వాలని అధికారులను కోరారు.

హార్టీకల్చర్‌లో అక్రమాలపై నిలదీత

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్లకే పెద్దపీట వేయడం, లెస్‌కు టెండర్ దక్కించుకుని పనులు చేయకపోయినా నోరెత్తకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలను ప్రదర్శించారు. దీనిపై హార్టీకల్చర్ విభాగం డీడీ దామోదర్ వివరణ ఇస్తూ గత కమిషనర్ సాయికాంత్‌వర్మ తనతో బలవంతంగా నెల రోజులు సెలవు పెట్టించి గ్రీన్ కార్పొరేషన్ ద్వారా కాంట్రాక్టర్లకు రూ.తొమ్మిది కోట్లు బదలాయించుకున్నారని వివరించారు. దీనిపై సంతృప్తి చెందని కార్పొరేటర్లు ప్రస్తుతం హార్టీకల్చర్ ఎవరు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో చెప్పాలని పట్టుబట్టారు. చివరకు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు అభ్యర్థన మేరకు హార్టీకల్చర్ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపు, ఏడాదిపాటు కొనసాగింపుఅంశానికి ఆమోదం తెలిపారు. బాల్యం కేంద్రాల్లో పనిచేస్తున్న 46 మంది టీచర్లు, 42 మంది ఆయాలకు గౌరవ వేతనం చెల్లించే అంశంపై 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి మాట్లాడుతూ తన వార్డులో బాల్యం కేంద్రం ఉందని చెబుతున్నారని, ఎక్కడుందో తనకు తెలియదన్నారు. 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ మాట్లాడుతూ ఆర్పీలుగా పనిచేస్తున్నవారే ఆయాలుగా, టీచర్లుగా గౌరవ వేతనం పొందుతున్నారని దీనిపై విచారణ జరపాలని కోరారు. దీనిపై పూర్తివివరాలను అధికారులు అందించాలని ఆదేశిస్తూనే ఆ అంశాన్ని ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. టౌన్‌ప్లానింగ్‌లో ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ సిస్టమ్‌కు సంబంధించిన ఉద్యోగుల సర్వీసు కొనసాగింపు, పారిశుధ్య కార్మికులకు రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రోత్సాహకాలు అందజేయడం, రూ.1.16 కోట్లతో సబ్బులు, కొబ్బరినూనె కొనుగోలు వంటి అంశాలను సభ్యులు ఆమోదించారు. మారియట్ హోటల్ నుంచి ఎన్‌జీజీఎస్ కాలనీ వరకూ రోడ్డుకు ఇరువైపులా కాలువపై స్లాబ్‌ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల అభివృద్ధికి సంబంధించిన మూడు అంశాలకు మేయర్ ముందస్తు ఆమోదం తెలపడంపై సభ్యులు అభ్యంతరం తెలుపుతూ వాయిదా వేయాలని కోరారు. దీంతో వాటిపై నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి కౌన్సిల్ సమావేశమై ఎజెండాలోని మిగిలిన అంశాలపై చర్చిస్తామని మేయర్ ప్రకటించారు.

ఎక్కడ చూసినా చెట్ల వ్యర్థాలే!

మురళీనగర్, సెప్టెంబరు 22; మురళీనగర్‌లో ఈపీడీసీఎల్, జీవీఎంసీల మధ్య సమన్వయ లోపంతో పారిశుధ్య పనులు పక్కదారి పడుతున్నాయి. సబ్‌స్టేషన్ల నిర్వహణ సమయాల్లో చెట్లను కొట్టడంతో రోజుల తరబడి కొమ్మలు, మోడులు, చెత్తకుప్పలుగా తయారైనా సిబ్బంది స్పందించడం లేదు. మురళీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్కడ కొట్టిన చెట్లు అక్కడే, ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరే ఎండిన స్థితిలో దర్శనమిస్తున్నాయి. ఇలాంటిచోట పొరపాటున అగ్ని రాజుకుంటే పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ముప్పు పొంచి ఉన్నా సబ్‌స్టేషన్ ఇంజనీరు, సహాయక సిబ్బంది, క్షేత్రస్థాయి జీవీయంసీ, కరెంటు ఆఫీసు సిబ్బందికి పట్టడం లేదు. ముప్పు వాటిల్లకముందే వ్యర్థాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఆనుకొనే ఎన్‌జీజీఓస్ కాలనీ దగ్గర స్కూళ్లు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఈ అపాయాన్ని దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో పనిచేయాలని కోరుతున్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న ఏడీ విజయకుమార్, తదితరులు

ఘనంగా ఫార్మసిస్టుల దినోత్సవం

అగనంపూడి, సెప్టెంబరు 25: దువ్వాడ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి భరోసా, ఆరోగ్యకరమైన సమాజాన్ని పెంపొందించడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఫార్మసీ విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, కన్వీనర కమలకుమారి, కో-కన్వీనర్ సత్యలక్ష్మి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న గొలగాని అప్పారావు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 25: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లిచడంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించడానికి జీవీఎంసీ అధికారులు చొరవ చూపకపోవడం బాధాకరమని గ్రేటర్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. బుధవారం నాతయ్యపాలెంలో జరిగిన 68, 69 వార్డుల పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతు ఈ నెల 30న చేపట్టనున్న మహా ధర్నాను కార్మికులంతా విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్మికులు లక్ష్మణరావు, అప్పన్న, రామలక్ష్మి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ చొరవతో కార్మికులకు పీఎఫ్ సర్వీసు క్రమబద్ధీకరణ

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 25: కాంట్రాక్టర్ల మధ్య తగాదాతో స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్, ఆర్ఈడీ కార్మికులు పన్నెండేళ్ల సర్వీసు కోల్పోయారని, ఏఐటీయూసీ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యుడు, కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఏ విజయ్‌భాస్కర్ చొరవతో సమస్య పరిష్కారమైందని యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బూసి వెంకటరావు అన్నారు. ప్లాంట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లగా 50 మంది కార్మికుల పీఎఫ్ ఖాతాలు నిలిచిపోయాయని, రూ.రెండు కోట్ల పీఎఫ్ సొమ్ము కాంట్రాక్టర్ పీఎఫ్ కోడ్ ద్వారా కర్ణాటకరాష్ట్రంలోని హుబ్లీ ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో స్తంభించిపోయిందన్నారు. ఈ విషయాన్ని ఏఐటీయూసీ జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో కర్ణాటక సమితి స్పందించి కార్మికులకు న్యాయం జరిగేలా చేసిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజు, డి.చంద్రరావు, డి.జగ్గారావు, రామునాయుడు, అప్పలనరసమ్మ, అప్పారావు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు చిత్తు కావద్దు

పెందుర్తి, సెప్టెంబరు 25: యువత మాదక ద్రవ్యాల బారిన పడరాదని ఉమ్మడి విశాఖ జిల్లా ఔషధ నియంత్రణాధికారి ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం పెందుర్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తుకు బానిసైన యువత శారీరక, మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావాలు వివరిస్తూ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 54, టమాటా 46, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 26, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 28, క్యారెట్ 38, దొండకాయలు 38, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 90, మునక్కాడలు (కిలో) 86, బరబాటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 40, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 40, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 54, కంద 64, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

నిలిచిన యారాడ రోడ్డు నిర్మాణ పనులు


నిర్మాణ పనుల కోసం తవ్వి వదిలేసిన రోడ్డు

- గోతులమయమైన, రాళ్లుతేలిన రహదారిపై ప్రయాణాలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్న వాహనదారులు
- కొండ పైనుంచి రాళ్లు దొర్లుకొస్తుండడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
- ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

మల్కాపురం, సెప్టెంబరు 25: యారాడ కొండపై చేపడుతున్న రహదారి నిర్మాణ పనులు నెల రోజులుగా నిలిచిపోయాయి. దీంతో గోతులు, రాళ్ల తేలిన ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండను రెండువైపులా తవ్వి వదిలేయడంతో కొన్ని చోట్ల ఈ రహదారి బురదమయంగా మారింది. దీని తోడు కొండ పైనుంచి రాళ్ల దొర్లుకుని వస్తుండడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ మార్గం మరింత ప్రమాదకరంగా ఉంటుందని, విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. యారాడ గ్రామానికి వెళ్లడానికి ఇదే ఒక్కటే ప్రధాన మార్గం కావడంతో తమకు ఇక్కట్లు తప్పడం లేదని పేర్కొంటున్నారు.

యారాడ కొండపై రోడ్డు విస్తరణకు గాను జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు సూచించిన మేరకు కొండను తవ్వి రోడ్డును వెడల్పు చేయాలని ప్రణాళికలను సిద్ధం చేసి టెండర్లను ఆహ్వానించారు. ఇందుకోసం రూ.3.50 కోట్లు కేటాయించారు. గ్రామంలోని ఓ వ్యక్తి ఈ టెండర్‌ను దక్కించుకుని, కొద్దిరోజులు పనులు చేపట్టి ఆ తర్వాత నిలిపివేశారు. కారణం అడిగితే, ఇసుక లభ్యం కావడం సమాధానమిస్తున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. అసలు కారణం పరిశీలిస్తే ఈ మార్గం చాలా ఎత్తులో ఉండడంతో టెండర్‌లో కేటాయించిన


కొండ పైనుంచి దొర్లివచ్చిన రాళ్లు

నగదు సరిపోవడం లేదని, అదనంగా ఖర్చవుతుందని సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్టు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవు మేర విస్తరించాలి. కొండ అడ్డంగా ఉంటే అటు, ఇటు తవ్వకాలు చేపట్టి రోడ్డును నిర్మించాలని టెండర్‌లో పేర్కొన్నారు.


ఇప్పటివరకు నిర్మించిన రహదారిపై రాళ్లుతేలిన దృశ్యం

ఈ స్థితిలో పల్లపు ప్రాంతంలో జోరుగానే కొండను తవ్వి రోడ్డును విస్తరించారు. ఎత్తుగా ఉన్నచోట్ల రెండు పక్కలా తవ్వి వదిలేశారు. దీంతో గోతులమయమైన ఈ రోడ్డులో నిత్యం రాకపోకలు సాగించే వందలాది మంది పర్యాటకులు, స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రస్తుతం దిగువ ప్రాంతంలో రోడ్డుపై వేసిన పిక్క తేలిపోయి ప్రమాదకరంగా మారింది. అందువల్ల జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


పినమడకలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు


89వ వార్డు చంద్రనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గణబాబు

ప్రజా శ్రేయస్సే చంద్రబాబు ధ్యేయం

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి, సెప్టెంబరు 25: ప్రజా సంక్షేమం, శ్రేయస్సు కోసం అకుంఠిత దీక్షతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు పరిధి పినమడక రావిచెట్టు వద్ద బుధవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో కార్యక్రమా లను చేపట్టిందన్నారు.

దివ్యాంగులు, సామాజిక పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, డీఎస్సీ నోటిఫికేషన్ తదితర హామీలను అమలు చేసింద న్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడు మంచే మంచే చేస్తుంద న్నారు. విజయవాడ వరద ప్రాంతాల్లో ప్రజల శ్రేయస్సు కోసం చంద్రబాబు చూపిన చొరవ మరిచిపోలేనిదన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్సీ శేషాద్రి, కార్పొరేటర్ వరలక్ష్మి, మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు, నాయకులు కర్రి దశేంద్ర, గవర సోమశేఖర్, డి.త్రినాథరావు, వసంత్, జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. 79వ వార్డు పరిధి అన్నపూర్ణ నగర్, ఎన్టీఆర్ నగర్, గల్లవానిపాలెంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే స్థానికంగా ఏర్పాటు చేసిన బోరింగులను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రజలకు ఆర్థిక భారంగా మారిన అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేయించామన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ఆందోళన చెందనవసరం లేద న్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మేడిశెట్టి విజయ్, కరణం పైడిరాజు, జి.కనకభవాని, వెంకటరావు, సత్యారావు, నాగేశ్వరరావు, సుబ్బరాజు, సింగిడి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.


పెదగంట్యాడలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న టీడీపీ శ్రేణులు

త్వరలోనే మహిళలకు తీపి కబురు: ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: రాష్ట్రంలోని మహిళలకు త్వరలో తీపి కబురు అందనుందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తైన సందర్భంగా 89వ వార్డు చంద్రనగర్‌లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి నుంచి అమల్లోకి తెచ్చేందుకు సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కూడా త్వరలోనే ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. అనంతరం విజయవాడ వరద సమయంలో సేవలందించిన పారిశుధ్య కార్మికులను కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో జెడ్సీ హైమావతి, జనసేన నేతలు అంగ దుర్గాప్రసాద్, ప్రశాంతి, యూసీడీ ఏపీడీ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పలు వార్డులలో..

పెదగంట్యాడ: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టీడీపీ మండల నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి సర్కారు వంద రోజుల పాలనలో అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి సీతానగరంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుర్గవానిపాలెం, ముసలినాయుడు నిర్వాసిత కాలనీల్లో ఈ కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు ఎం.పెంటయ్య, ఎం.అప్పారావు, మొల్లి అప్పారావు, యు.అప్పలరాజు, బస అప్పలరెడ్డి, డి.పెరుమాళ్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు అధ్వర్యంలో సీతానగరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమన్ని చేపట్టారు. కాగా 65వ వార్డులో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ఆధ్వ ర్యంలో బీసీ రోడ్డు, సంజీవగిరి కాలనీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధిని వివరించి, ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు.

ఎన్ఏడీ జంక్షన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై 90వ వార్డులో టీడీపీ నేతలు ఇది మంచి ప్రభుత్వం పేరుతో ఇంటింటి ప్రచారం చేశారు. సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికీ స్టిక్కర్ అతికించి, చంద్రబాబు పాలనపై అభిప్రాయాన్ని తీసుకున్నారు. కాకానీనగర్ విమాన్ నగర్, వినోద్‌నగర్ ప్రాంతాల్లో కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. బుచ్చిరాజుపాలెం, గాంధీనగర్, జయప్రకాష్ నగర్, గవరవీధి ప్రాంతాల్లో ఇళ్లకు స్టికర్లు కనిపించలేదు.

వేపగుంట: గ్రేటర్ 98వ వార్డు పరిధి సాయిమాధవనగర్, లక్ష్మీనరసింహనగర్, శ్రీనివాసనగర్‌లలో ఇంటింటికీ వెళ్లి కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది వంద రోజుల ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డీఎస్సీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బంటు సురేశ్‌కుమార్, మామిడి దుర్గాప్రసాద్, ఎన్.అప్పలరాజు, ఎస్.వెంకటరావు, పురుషోత్తమ్, రవి, సచివాలయ సిబ్బంది హజరత్ ఇబ్రహీమ్, అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.


98వ వార్డు శ్రీనివాస నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది

ఉక్కు కార్మిక సంఘ నాయకుల్లో విభేదాలు!

గుర్తింపు సంఘం ఎన్నికల దృష్ట్యా వేర్వేరుగా పోరాటాలు చేస్తున్నారని ఆరోపణలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 25: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల్లో విభేదాలు బయటపడుతున్నాయి. ప్రస్తుతం ఉక్కు కర్మాగారంలో గుర్తింపు యూనియన్ ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో ఆయా కార్మిక సంఘాలు వేర్వేరుగా పోరాటాలు సాగిస్తున్నాయని కార్మికుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులకు హెచ్ఆర్ఏతో పాటు ఇతర అలవెన్స్‌లను యాజమాన్యం తగ్గించింది. దీనిపై తొలిరోజు అన్ని కార్మిక సంఘాలు కలిసికట్టుగా పోరాటం చేసినా, ఆ తర్వాత ఎవరికి వారు పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక యూనియన్‌పై మరొక యూనియన్ నిందారోపణలు చేసుకుంటున్నాయి.. ఎవరి పోరాటం వారిదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. అయితే ఉక్కు పరిరక్షణ విషయంలో మాత్రం కలిసికట్టుగా ఆందోళనలు సాగిస్తుండడం గమనార్హం. కాగా స్టీల్‌ప్లాంట్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. అందుకే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ బలపడాలంటూ కార్మిక నేతలు ఎవరికి వారు సొంతంగా పోరాటాలు సాగిస్తున్నారన్న అనే విమర్శలు కార్మికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇలా ఎవరికి వారు పోరాటాలు సాగించడం వల్ల ఉక్కు యాజమాన్యం ముందు చులకన అయిపోతామని, ఆర్థిక ప్రయోజనాలను కోల్పోతామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖోఖో పోటీల విజేత అక్కిరెడ్డిపాలెం హైస్కూల్

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 25: గాజువాక హైస్కూల్ మైదానంలో బుధవారం జరిగిన జోన్ స్కూల్ గేమ్స్ పోటీల్లో ఖోఖో బాలబాలికల జూనియర్, సీనియర్ విభాగాలలో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానంలో జరిగిన అభినందన కార్యక్రమంలో హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపినప్పుడే సమాజంలో మంచి గుర్తింపుతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్ ఇస్మాయిల్, రవిచంద్, శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, స్కూల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు సంగ్రాన నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.


విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం, తదితరులు


దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కరణంరెడ్డి, తదితరులు

దీనదయాళ్ ఉపాధ్యాయకు నివాళి

గాజువాక, సెప్టెంబరు 25: పారిశ్రామిక ప్రాంతంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని బుధవారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి బీజేపీ కార్యాలయంలో దీనదయాళ్ చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకాత్మక మానవతావాదం సిద్ధాంతాల ద్వారా అట్టడుగున ఉన్నవారి అభ్యున్నతి కోసం దీనదయాళ్ ఉపాధ్యాయ ఎంతో కృషి చేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రధాని మోదీ దీనదయాళ్ సిద్ధాంతాన్నే పాటిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, రామస్వామి, మనోహర్, రామునాయుడు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

86, 87 వార్డులలో..

ఆటోనగర్: గ్రేటర్ 86వ వార్డు పరిధి శాతవాహన నగర్‌లో బీజేపీ వడ్లపూడి మండల అధ్యక్షురాలు బొండా శ్రీదేవి ఎల్లాజీరావు ఆధ్వర్యంలో, 87వ వార్డు వడ్లపూడిలో బీజేపీ నాయకుడు లక్కరాజు సోంబాబు సారథ్యంలో అంత్యోదయ సిద్ధాంత కర్త దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లాజీ రావు దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకునిగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి దీనదయాళ్ ఉపాధ్యాయ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణాజీ, వెంకటరావు, శ్రీనివాస్, లావణ్య, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

59వ వార్డులో..


దీయదయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొక్కిలిగడ్డ విజయ్‌బాబు, తదితరులు

మల్కాపురం: గ్రేటర్ 59వ వార్డు 83వ బూత్ పరిధిలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్‌బాబు ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సిద్ధాంతాలను పాటించి బీజేపీ మూడు సార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సదాస్యత అభియాన్ సహ ప్రముఖ్ రామకృష్ణ, బీజేపీ నేతలు జి.సతీష్, సింహాచలం, సత్యనారాయణ, నూకరత్నం, సుజాత తదితరులు పాల్గొన్నారు.

90వ వార్డులో..

ఎన్ఏడీ జంక్షన్: బుచ్చిరాజుపాలెంలోని బీజేపీ 90వ వార్డు కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ 'పశ్చిమ' ఇన్‌చార్జి దాడి పురుషోత్తమ్ రమేశ్ మాట్లాడుతూ అందరికీ సమాన అవకాశాలు, అభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన దీన్‌దయాళ్ ఆశయాలు ఆచరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్ల మంజుల, అప్పలరాజు, టి.చంద్రశేఖర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో స్వచ్ఛతా హీ సేవ



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న సర్పంచ్ దూది విజయలక్ష్మి

పెందుర్తి, సెప్టెంబరు 25: మండలంలోని ఎస్ఆర్‌పురం పంచాయతీ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ దూది విజయలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ స్వచ్ఛతాహీ సేవా ఉద్దేశాన్ని ప్రతి ఇంటికి చేర్చాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ, ర్యాలీ చేశారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లూరి రాజు, దూది వెంకటరమణ, కార్యదర్శి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాలెం వుడా లేఅవుట్ వాకర్స్ పార్కులో..

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం ఉడాలేఅవుట్ వాకర్స్‌పార్క్‌లో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నగరాన్ని క్లీన్‌సిటీగా మార్చి, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి ర్యాంకు సాధించేందుకు ఉద్యోగులు, కాలనీవాసులు ముందుకు రావాలని సూచించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలంగా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, ఎం.వాసుదేవరావు, వై.తిరుమలరావు, సత్యనారాయణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా లక్ష్మీనారాయణ


బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ

వేపగుంట, సెప్టెంబరు 25: గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా గవక లక్ష్మీనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సింహపురికాలనీలోని కార్యాలయంలో ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. ఇప్పటివరకు శ్రీకాకుళం ఎంవీ ఆడిట్ విభాగంలో పనిచేసి, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తానని, రిజిస్ట్రేషన్ అయిన రోజే డాక్యుమెంట్‌ను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వీవీఎస్ మాధవీకుమారి బదిలీపై అనకాపల్లి వెళ్లారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఎన్ఏడీ జంక్షన్, సెప్టెంబరు 25: జీవీఎంసీ 90వ వార్డు కాకానీనగర్‌లో రహదారి నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. కెనరా బ్యాంకు నుంచి శివాలయం మీదుగా రహదారి అధ్వానంగా మారడంతో ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తీసుకువెళ్లామని, దీంతో జీవీఎంసీ రూ.18.57లక్షలతో బీటీ రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మౌలిక వసతుల కల్పనపై కౌన్సిల్‌లో చర్చించామని, కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈఈ రత్నాకర్ రెడ్డి, ఏఈ వెంకటలక్ష్మి, కాకానీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.జగన్మోహనరావు, సిద్ధరాజు, భాస్కరరావు, లలిత, మురళి, తదితరులు పాల్గొన్నారు.

'దేవర'కు హాజరవ్వాలంటూ ఎమ్మెల్యే గణబాబుకు ఆహ్వానం

ఎన్ఏడీ జంక్షన్, సెప్టెంబరు 25: జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదలకు ముఖ్యఅతిథిగా రావాలని ఎమ్మెల్యే గణబాబును నందమూరి ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సుకన్య సినిమాహాల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించే కేక్ కటింగ్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. మళ్ల చినఅప్పారావు, తిరుపతి శ్రీను, జనార్దన్, శంకర్ కిట్టు తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

మూన్నాళ్ల ముచ్చటగా బస్‌బేలు



నగరంలో అట్టహాసంగా ప్రారంభించిన బస్‌బేల వెలుగులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. నగరంలో 20 చోట్ల సుమారు రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ వెచ్చించి స్మార్ట్ బస్‌బేలను జీవీఎంసీ నిర్మించింది. ఆకర్షణీయంగా ఎలివేషన్, లైటింగ్, ఆయా ప్రాంతాలను తెలియజేసేలా నామఫలకాలను ఏర్పాటుచేసింది. ప్రారంభించి ఆరు నెలలు గడవకుండానే బస్‌బేలన్నీ నిర్వహణలోపంతో పాడైపోతున్నాయి. అక్కయ్యపాలెం పోర్ట్ ఆస్పత్రి సమీపంలోని బస్‌బే అయితే నామఫలకం, ఎలివేషన్ ఊడిపోవడంతోపాటు లైట్లు వెలగకపోవడంతో నామరూపాల్లేకుండా పోయింది.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

వాయు కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు

మహారాణిపేట, సెప్టెంబరు 25: జిల్లాలో వాయు కాలుష్య నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. 'జాతీయ స్వచ్ఛమైన వాయువు' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న చర్యలపై కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోనూ, నగర పరిధిలో వాయు కాలుష్య కారకాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు, గాలి నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. నగరంలో అత్యంత రద్దీ ప్రాంతాలను గుర్తించి వాయు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర రాష్ట్ర కాలుష్య నియంత్రణ, జీవీఎంసీ, రవాణా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మన్యం ధీరుడు'కు పన్ను మినహాయింపుపై మంత్రికి వినతి

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 25: మన్యం ధీరుడు చిత్రానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్లు తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తెలిపారు.నగరానికి వచ్చిన మంత్రిని బుధవారం కలిసి పలు విషయాలపై వినతిపత్రం అందజేశామన్నారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు న్యాయం చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీవీఎంసీ ఉద్యానవన విభాగంలో అక్రమాలు సహా పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో ఉచిత శిక్షణ అవకాశం

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 25: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలోని కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడపై ఉన్న సంస్థ కార్యాలయంలో అక్టోబరు 1 నుంచి నవంబరు 30 వరకు ఉదయం 10 నుంచి 11-30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత శిక్షణ కోసం ఆసక్తి గల గృహిణులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8019388999 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఫార్మాసిస్ట్ డే వేడుకలు



ఫార్మశీ అభ్యరులతో ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు, అధ్యాపకులు

కంచరపాలెం, సెప్టెంబరు 25: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఫార్మశీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఫార్మాసిస్ట్ డే సందర్భంగా కళాశాలలో ఈ కోర్సు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సత్కార సభకు ఏపీ రాష్ట్ర ఫార్మశీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డా.విలియం క్యారీ హాజరై ఫార్మాసిస్టుల ప్రాధాన్యాన్ని వివరించారు. వైద్యరంగంలో ఎంతో ఉపయోగకరమైన వ్యక్తులు ఫార్మాసిస్టులని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఫార్మశీ విభాగాధిపతి గోవర్ధన్, అధ్యాపకులను ముఖ్య అతిథి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరానగర్-3 నూతన కమిటీ ఎన్నిక

కంచరపాలెం, సెప్టెంబరు 25: జీవీఎంసీ 48వవార్డు పరిధి ఇందిరానగర్-3 గ్రామ కమిటీ ఎన్నికల్లో నూతన సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ టీడీపీ నాయకుడు సత్యాడ అప్పారావు, కార్యదర్శిగా మహేశ్వర్రావు, కోశాధికారిగా దారా చినబాబు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. నూతన కమిటీని కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు అభినందించారు.

ఉత్పత్తుల నాణ్యతపై అవగాహన కల్పించాలి

మహారాణిపేట, సెప్టెంబరు 25: వినియోగదారుల రక్షణ, ఉత్పత్తుల నాణ్యత, ప్రజలకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించేందుకు కృషిచేయాలని ఆర్ఐఎన్ఎల్ వైజాగ్ స్టీల్ జనరల్ మేనేజర్ రుచిరా గుప్తా తెలిపారు విశాఖలోని హోటల్ గ్రీన్ పార్కులో బుధవారం మనక్ మహోత్సవ్ ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ బీఎస్ఐ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నాణ్యతా ప్రమాణాల నిర్వహణ కోసం కృషి చేస్తుందని తెలిపారు విద్యావినియోగ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు, ఆధునిక సాంకేతికత ద్వారా రాష్ట్రంలో నాణ్యమైన పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పరిశ్రమలకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఐ రాష్ట్ర విభాగాధిపతి వినోద్, ఐఐఎమ్ ప్రొఫెసర్ దీపికాగుప్తా, పరిశ్రమలు, విద్యాసంస్థలు, శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

31వ వార్డులో రోడ్డుపైనే చెత్త

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 25: జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ప్రాంతాల్లోని పారిశుధ్యం అధ్వానంగా మారింది. వార్డులో పలు ప్రాంతాల్లోని మధ్యాహ్నం వరకు చెత్తను తొలగించడంలేదు. దీంతో ఆయా రహదారుల్లో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రంగాస్ట్రీట్‌లో పెద్ద చెత్త కుప్పను రోడ్డుపైనే వదిలేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి సమస్య లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వాహనాల జోరు.. అదుపు చేసేవారు లేరు!

» ట్రాఫిక్ నియంత్రణలో నిర్లక్ష్యం » ఆర్అండ్‌బీ కూడలిలో జనం బేజారు



ట్రాఫిక్ కానిస్టేబుల్ లేకపోవడంతో ఎవరికి నచ్చినట్టుగా వారు వెళ్లిపోతున్న వాహనదారులు



ఖాళీగా ఉన్న ఆర్అండ్‌బీ జంక్షన్ ట్రాఫిక్ క్యాబిన్



కూడలిలో మూడు మార్గాల్లో ఒకేసారి వెళ్లిపోతున్న వాహనాలు

మురళీనగర్, సెప్టెంబరు 25; విశాఖ ఉత్తరంలోని ఆర్అండ్‌బీ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణ పూర్తిగా గాలి కొదిలేశారు. ఈ నాలుగు రోడ్ల కూడలిలో గత పది రోజులుగా సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. దీంతో వాహనాలు అడ్డు-అదుపు లేకుండా దూసుకొస్తున్నాయి. అటు మర్రిపాలెం ఉడా లేఅవుట్.. ఇటు మాధవధార అంబేడ్కర్‌కాలనీ, కేపీ స్పార్ గ్రీన్ వ్యాలీ వైపు వచ్చే వాహనాలు హైవే దాటి రాకపోకలు సాగించాలి. హైవే నాలుగు వరుసల్లో మరో ప్రధానదారి నేరుగా ఎన్ఏడీ వైపు ప్రయాణించే వాహనాలు, ఇటు కంచరపాలెం వైపు వెళ్లే భారీ వాహనాల రాకపోకలతో నిత్యం ఈ జంక్షన్ రద్దీగా ఉంటుంది. నాలుగు వైపులా ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పరిసరాల్లో 20 వరకు ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. ఈ కారణంగా ఉదయం వేళ ఇక్కడ వాహన రాకపోకలు జాతరను తలపిస్తుంటాయి. తిరిగి సాయంత్రం కూడా అంతకు మించి వాహనాలు వేగంగా ప్రయాణిస్తుంటాయి. ఎన్ఏడీ జంక్షన్ దాటిన తర్వాత అంత ప్రాధాన్యమున్న ఆర్అండ్‌బీ కూడలిలో వాహనాల్ని నియంత్రణ లేకుండా వదిలేస్తున్నారు. పక్కనే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, చిత్రంగా ఈ ఆర్అండ్‌బీ జంక్షన్‌లోనే కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషను కూడా ఉంది. సర్కిల్ ఇన్‌స్పెక్టరు కార్యాలయం, ఎస్ఐలు, సిబ్బంది ఇక్కడి ఎయిర్‌పోర్ట్ పోలీసు స్టేషన్ నుంచే విధులకు చేరుకుంటారు. వారి కంటపడినా ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ తిప్పలు పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు. చూసి చూడనట్లు ట్రాఫిక్ బుల్లెట్స్, రక్షక్ వాహనాలేసుకుని ఇదే సిగ్నల్ పాయింట్ మీదుగా వెళుతుంటారు. కానీ జంక్షన్‌లో ప్రయాణికులకు సాయపడటం లేదు. వారి ఉద్యోగ ధర్మం కూడా నెరవేర్చడం లేదని ప్రయాణికులు, ఈ ప్రాంతాల నివాసితులు పెదవి విరుస్తున్నారు.

బందోబస్తుకు వెళ్తే అంతేసంగతి: నగరంలో బుధ, గురువారాల్లో మంత్రి లోకేశ్ పర్యటన కారణంగా ఉన్న పోలీసులంతా ఆ మీటింగ్ జరిగే ప్రాంతంలోనే విధుల్లోకి వెళ్లిపోవడంతో క్యాబిన్లు ఖాళీ అయిపోయాయి. బిర్లా జంక్షన్, ఊర్వశి జంక్షన్ లాంటి రద్దీ ప్రాంతాల్లోనూ బుధవారం సిబ్బంది నామమాత్రంగా విధుల్లో కనిపించారు. నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉన్నా, ఉత్సవాలు, ప్రమాదాలు జరిగినా పోలీసులంతా ప్రత్యేక విధుల్లో వెళ్తున్నపుడు కనీసం ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పనిచేసినా వాహనదారులకు, పాదచారులకు కనీస రక్షణ లభిస్తుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇకనైనా, ట్రాఫిక్ వెతలు పరిష్కరించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదం ప్రజలకు పరమ పవిత్రం

» డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మహాయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ వ్యాఖ్య



వేంకటేశ్వర స్వామి విగ్రహానికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 25 తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని ప్రపంచ వ్యాప్తంగా పరమ పవిత్రంగా భావిస్తారని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన నగర అధ్యక్షుడు సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్ధతుగా బుధవారం డాబాగార్డెన్స్ ఎల్ఐసీ కూడలి వద్ద మహాయాగం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి సెట్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టి నామాలు ధరించారు. అనంతరం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దీక్ష, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ తిరుమల ప్రసాదం లడ్డూ తయారీలో కల్తీని కలలో కూడా ఊహించలేమన్నారు. భక్తులంతా...స్వామివారిని చూసి ఎంత తన్మయం పొందుతారో... శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించి అంతే ఆనందాన్ని వ్యక్తం చేస్తారన్నారు. విదేశాల్లో సైతం తిరుమల శ్రీవారు, లడ్డూ కోసం నిత్యం మాట్లాడుకోవడం మనమంతా చూస్తుంటామన్నారు. ఈ ఘటనపై ప్రతి ఒక్కరిలో తీవ్ర ఆవేదన ఉందన్నారు. డిప్యూటీ సీఎం చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం తెలియజేయడం మనందరి బాధ్యత అన్నారు. గురువారం నుంచి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. టీడీపీ సౌత్ ఇన్‌చార్జ్ ఎస్.సుధాకర్, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైరుతో హైటెన్షన్!



మాధవధార సర్వీసురోడ్డు మధ్య తెగిపడిన విద్యుత్ వైరు

మాధవధార, సెప్టెంబరు 25; నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ హైటెన్షన్ వైరు తెగిపడింది. బాటసారులు అప్రమత్తంగా ఉండడంతో ప్రమాదం తప్పింది. గ్రేటరు 51వ వార్డు మాధవధార హైవే సర్వీసు రోడ్డులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆర్టీఏ కార్యాలయం రోడ్డు దిగువగా జీఎస్ఐ కార్యాలయానికి సరఫరా అందిస్తున్న వైరు తెగిపడిన విషయాన్ని స్థానికులు గుర్తించి ఆ శాఖకు సమాచారం ఇవ్వడంతో తక్షణమే సరఫరా ఆపి వేసిన ఎస్ఎస్‌టీఎల్ మాధవధార విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. వేలాడుతున్న వైరును గమనించని వాహనదారులు తొలుత దగ్గరగా వచ్చి, భయపడి వాహనాల్ని మళ్లించి జాగ్రత్తగా పక్కకు మళ్లడంతో ప్రమాదం తప్పింది. వైరు తెగిపడిన సమయంలోనూ వాహన రాకపోకలు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఓ వైపు జోరువాన.. నీరు చేరిన రోడ్డులో తొలుత కరెంటు హైటెన్షన్ వైరు చూసి పాదచారులు, వాహనదారులు ఉలిక్కిపడ్డారు. ఎస్ఎస్‌టీఎల్ విద్యుత్ కార్యాలయ సహాయక ఇంజనీరు అప్పలరాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వైర్లు తొలగించారు.

50వ వార్డులో స్వచ్ఛతాహి సేవ

మాధవధార; గ్రేటరు 50వ వార్డు పరిధి తెన్నేటినగర్‌లో బుధవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. జోన్-5 ఏఎంహెచ్‌ఓ సునీల్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టరు సుధాకర్, వార్డు టీడీపీ అధ్యక్షుడు వరప్రసాద్ పాల్గొని స్థానికులకు స్వచ్ఛపరిసరాల ఆవశ్యకతను వివరించారు. తెన్నేటి విశ్వనాథం పార్కు పరిసరాల్ని శుభ్రపరచి రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తెన్నేటి విశ్వనాథం సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలి'

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 25: పాఠశాల దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకరరావు సూచించారు. 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో ప్రపంచ శాంతి దినోత్సవం పురస్కరించుకుని నార్త్ ఈస్ట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు అందుకున్నారు. పలు అంశాలపై చిత్రలేఖనాలు గీసి ఆకట్టుకున్నారు.

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఉషాకిరణ్

దొండపర్తి, సెప్టెంబరు 25: జనసేన పార్టీ రాష్ట అధ్యక్షుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, జనసైనికులు దొండపర్తి ప్రధాన రహదారిలో ఉన్న ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం సాయంత్రం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉషాకిరణ్ మాట్లాడుతూ ఇతర మతాలను గౌరవిస్తూనే హైందవ సంస్కృతి, సంప్రదాయాలకు, హిందువుల మనోభావాలకు భంగం కలిగినప్పుడు అందరూ రోడ్లపైకి వచ్చి సంఘటితంగా తమ నిరసన తెలియజేయాలని పవన్ కల్యాణ్ చెబుతున్నారన్నారు. మానవ తప్పిదాలకు ప్రళయాలు, ప్రకృతి వైపరీత్యాలు రాకుండా భగవంతుడిని శరణు వేడుదామని అంటుంటే, సినీ నటుడు ప్రకాష్‌రాజ్ అపహాస్యం చేయడం తగదన్నారు. తిరుపతి లడ్డు అపవిత్రం చేసిన వారిపై సిట్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమన్వయకర్తలు దుర్గ, త్రివేణి, సుధ, నాగలక్ష్మి, వీర మహిళలు నాగమణి, పార్వతి, శ్యామల, కళ, రేఖ, లక్ష్మి పాల్గొన్నారు.

పండిత్ దీనదయాల్‌కు ఘననివాళి

సీతమ్మధార, సెప్టెంబరు 25: సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో బుధవారం పండిత్ దీనదయల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు దీన దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం కన్వీనర్ సురేష్‌బాబు, పృథ్వీరాజ్, శంకరరావు, పోతురాజు, రాకేష్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: గ్రేటర్ 42వ వార్డులో బీజేపీ అధ్యక్షుడు గురుగోవింద్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం పండిత్ దీన్ దయాల్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం బీజేపీ ఇన్‌చార్జ్ ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, రాజగిరి కృష్ణ, 42వ వార్డు ప్రధాన కార్యదర్శి ఎ.ఆచారి, వెంకటరావు, రత్నం, శ్రీదేవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్లెలు, మందారాలు పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, ఇతర అతిథులు

సీతంపేట, సెప్టెంబరు 25: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో భాగవతుల కృష్ణారావు రచించిన కథా సంపుటి మందారాలు, భాగవతుల సత్యనారాయణ మూర్తి రచించిన కథా సంపుటి మల్లెలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్ ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ రచయితలు మందారాలు, మల్లెల పరిమళాలను తమ కవితల ద్వారా లోకానికి అందించారన్నారు. ఈ పుస్తకాలు మన సామాజిక ఇతివృత్తాలను ప్రతిబింబించే కథలన్నారు. కథలు సమాజ పరివర్తనకు దోహదపడాలన్నారు. రచయిత, విశ్లేషకులు డాక్టర్ డి.వి. సూర్యారావు మందారాలు కథాసంపుటిని సమీక్షిస్తూ కృష్ణారావు కథలు సంప్రదాయ పరిమళంతో సామాజిక రుగ్మతలకు పరిష్కారం చూపించగలవన్నారు. రచయిత డాక్టర్ కె.జి.వేణు మల్లెలు క థా సంపుటిని సమీక్షిస్తూ మాట్లాడారు. ఈ సందర్భంగా రచయితలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూరపనేని విజయ్‌కుమార్, చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.సుబ్రహ్మణ్యం, ఎం.సుబ్బారావు, గౌరీపతి శాస్త్రి, కొత్తూరు రమణ, బి.రాధారాణి, తనికెళ్ళ సూర్యకళ, డాక్టర్ కెవిఎస్ మూర్తి, పరమేశ్వరరావు, శ్రీనివాసరావు, డీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుందాం

... 5వ పేజీ తరువాయి

మరికొందరు సందేహం వ్యక్తంచేశారు. కర్మాగార యాజమాన్యం ఒంటెత్తు పోకడలు, కార్మికుల్లో కొందరి ప్రవర్తనపై కూడా ప్రజల్లో అపోహలు ఉన్నాయని కొందరు అన్నారు. అందువల్ల పటిష్టమైన యాజమాన్యం ఉండాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర పరిధిలో ఉన్న భూములు మొత్తం బదిలీ చేస్తే బ్యాంకులు నుంచి రుణం తీసుకుని కర్మాగారానికి నడుపుకోవచ్చునని సమావేశంలో ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. ఏదోవిధంగా కర్మాగారాన్ని నిలబెట్టుకోవాలని, సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు నివేదిక రూపంలో సమర్పించాలని తీర్మానించారు. చంద్రబాబు ద్వారా కేంద్రంతో చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలని, అందుకు కాలయాపన కాకుండా సత్వరమే చర్యలు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ విశాఖపై తనకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. పాదయాత్ర సమయంలో ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చానని గుర్తుచేశారు. విశాఖ ఉక్కుతో ప్రతి తెలుగువాడికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, హైదరాబాద్‌లో తమ ఇంటికి విశాఖ ఉక్కు స్టీల్ వాడామన్నారు. కర్మాగారాన్ని వెంటాడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి కార్మికుల కళ్లల్లో ఆనందం చూడాలనే దృఢ సంకల్పంతో కేంద్రంతో సంప్రతింపులు జరుపుతున్నామని అన్నారు. అందరికీ ఆమోద్యమైన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రశ్నే ఉత్పన్నం కాదన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను చంద్రబాబునాయుడుకు నివేదిస్తామన్నారు. కేంద్రంతో సీఎం చర్చించి ఉక్కు కర్మాగారంపై ఒక నిర్ణయం తీసుకుంటారని లోకేశ్ వెల్లడించారు. రానున్న రోజుల్లో మిగతా సమస్యలపై చర్చించుకుని నిర్ణయాలు తీసుకుందామన్నారు. అందరూ కూర్చుని చర్చించుకుంటే పరిష్కారం కాని సమస్య ఉండదన్నారు. సమావేశంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, కోండ్రు మురళి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, టీడీపీ పెందుర్తి, విశాఖ దక్షిణ ఇన్‌చార్జులు గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, సెయిల్ డైరెక్టర్, బీజేపీ నాయకుడు కాశీవిశ్వనాథరాజు పాల్గొన్నారు.

అదానీకి కేటాయించిన కొండను సందర్శించిన లోకేశ్

మధురవాడ పనోరమ హిల్స్‌కు అనుకుని అదానీ డేటా సెంటర్‌కు కేటాయించిన కొండ ప్రాంతాన్ని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ బుధవారం సాయంత్రం సందర్శించారు. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

కౌన్సిల్‌లో సమస్యలు ఏకరువు

... 5వ పేజీ తరువాయి

కోరారు. కరెంట్ స్తంభాలు ఏర్పాటుచేయకపోవడం, లైట్లు అమర్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు రెండో వార్డు కార్పొరేటర్ గాడుచిన్నికుమారి వివరించారు. నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలుపల్లి ఏడుకొండలు మాట్లాడుతూ తమ వార్డులో సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రతించాలో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. తన వార్డు పరిధిలోని సర్వేనంబర్ 314లో మూడు వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొందరు ఆక్రమణలకు పాల్పడుతున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తొమ్మిదో వార్డు కార్పొరేటర్ స్వాతీదాస్ మాట్లాడుతూ తన వార్డు పరిధిలో సర్వేనంబర్ 143/2లోని లేఅవుట్‌లో 57 సెంట్లు ప్రభుత్వం స్థలం ఉందని దానిని నకిలీ డాక్యుమెంట్లతో కబ్జాకు ఇద్దరు యత్నిస్తున్నారని దీనిపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి మాట్లాడుతూ స్వర్ణభారతి స్టేడియం పనులు ఎప్పటికి పూర్తవుతాయో అర్థం కావడం లేదని, దీనివల్ల క్రీడాకారులు, వాకర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆవరణలోకి పశువులు వెళ్లినప్పుడు జీవీఎంసీ అధికారులు వాటి యజమానుల నుంచి డబ్బులు తీసుకుని వదిలేస్తున్నారని ఆరోపించారు. ఆ సమయంలో వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు కలుగజేసుకుని 'నువ్వో క్రిమినల్‌వి' అనడంతో సభలో గందరగోళం ఏర్పడింది. పరుష పదజాలంతో కార్పొరేటర్‌ను దూషించిన బాణాలను సస్పెండ్ చేయాలని కూటమి కార్పొరేటర్లు పట్టుబట్టారు. టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు సర్దిచెప్పారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ మేయర్‌తో 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌జైన్ వాగ్వాదానికి దిగారు. సీట్లో కూర్చోవాలని మేయర్‌తోపాటు ఇతర వైసీపీ సభ్యులు సూచించినా పట్టించుకోకుండా, తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని, లేనిపక్షంలో సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో మాట్లాడేందుకు మేయర్ అవకాశం కల్పించారు. తన వార్డు పరిధిలోని ఫుడ్‌కోర్టును తొలగిస్తామని ఏడాదిన్నర కిందట తీర్మానం చేసినా ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ క్రమంలో అసభ్యపదజాలం ప్రయోగించడంతో ఆయన్ను సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోక్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో అక్రమాలే జరిగాయని, సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అనడంతో వైసీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు జోక్యం చేసుకుని ఏదో మాట్లాడబోయారు. ఈ సమయంలో 'నువ్వొక డస్ట్‌బిన్' అని బాణాలను ఉద్దేశించి కంపా హనోక్ అనడంతో వివాదం తలెత్తింది. 'నీది టీడీఆర్ కుంభకోణం, నువ్వు బేవర్స్' అని బాణాల తిరిగి హనోక్‌ను అనడంతో ఇద్దరి మధ్య వాగ్వారం జరిగింది. బాణాలపై దాడికి హనోక్ దూసుకురాగా మిగిలిన సభ్యులు అడ్డుకున్నారు. 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ తన వార్డు పరిధిలో రోడ్లు ఇష్టారాజ్యంగా తవ్వేసి వదిలేస్తున్నారని, చీకట్లో ఆ గోతుల్లో పడి ఎంతోమంది ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇటీవల చెట్టివానిపాలెంలో 18 ఏళ్ల యువకుడు గోతిలోపడి మృతిచెందాడని ఆవేదన వ్యక్తంచేశారు. 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చంద్రరావు మాట్లాడుతూ క్లాప్ వాహనాలకు చెత్తలోడింగ్ చేసేందుకు 650 మందిని కాంట్రాక్టర్ ద్వారా నియమించుకున్నారని, ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేసి ఉద్యోగాల్లో పెట్టుకున్నారని ఆరోపించారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ తన వార్డు పరిధిలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేటు వ్యక్తి ఆక్రమించుకుని ఆవులను పెంచుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. తక్షణం ఆ భూమిని జీవీఎంసీ పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నైట్‌ఫుడ్‌కోర్ట్ పేరుతో ఏటా రూ.145 కోట్లు వసూలు చేస్తున్నారని, ఆ డబ్బులు ఎవరు వసూలు చేస్తున్నారు? జీవీఎంసీకి ఎంత చేరుతోందనే దానిపై వివరణ ఇవ్వాలని అధికారులను కోరారు.

హార్టీకల్చర్‌లో అక్రమాలపై నిలదీత

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్లకే పెద్దపీట వేయడం, లెస్‌కు టెండర్ దక్కించుకుని పనులు చేయకపోయినా నోరెత్తకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలను ప్రదర్శించారు. దీనిపై హార్టీకల్చర్ విభాగం డీడీ దామోదర్ వివరణ ఇస్తూ గత కమిషనర్ సాయికాంత్‌వర్మ తనతో బలవంతంగా నెల రోజులు సెలవు పెట్టించి గ్రీన్ కార్పొరేషన్ ద్వారా కాంట్రాక్టర్లకు రూ.తొమ్మిది కోట్లు బదలాయించుకున్నారని వివరించారు. దీనిపై సంతృప్తి చెందని కార్పొరేటర్లు ప్రస్తుతం హార్టీకల్చర్ ఎవరు ఎక్కడెక్కడ పని చేస్తున్నారో చెప్పాలని పట్టుబట్టారు. చివరకు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు అభ్యర్థన మేరకు హార్టీకల్చర్ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లింపు, ఏడాదిపాటు కొనసాగింపుఅంశానికి ఆమోదం తెలిపారు. బాల్యం కేంద్రాల్లో పనిచేస్తున్న 46 మంది టీచర్లు, 42 మంది ఆయాలకు గౌరవ వేతనం చెల్లించే అంశంపై 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి మాట్లాడుతూ తన వార్డులో బాల్యం కేంద్రం ఉందని చెబుతున్నారని, ఎక్కడుందో తనకు తెలియదన్నారు. 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్ మాట్లాడుతూ ఆర్పీలుగా పనిచేస్తున్నవారే ఆయాలుగా, టీచర్లుగా గౌరవ వేతనం పొందుతున్నారని దీనిపై విచారణ జరపాలని కోరారు. దీనిపై పూర్తివివరాలను అధికారులు అందించాలని ఆదేశిస్తూనే ఆ అంశాన్ని ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. టౌన్‌ప్లానింగ్‌లో ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్ సిస్టమ్‌కు సంబంధించిన ఉద్యోగుల సర్వీసు కొనసాగింపు, పారిశుధ్య కార్మికులకు రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రోత్సాహకాలు అందజేయడం, రూ.1.16 కోట్లతో సబ్బులు, కొబ్బరినూనె కొనుగోలు వంటి అంశాలను సభ్యులు ఆమోదించారు. మారియట్ హోటల్ నుంచి ఎన్‌జీజీఎస్ కాలనీ వరకూ రోడ్డుకు ఇరువైపులా కాలువపై స్లాబ్‌ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల అభివృద్ధికి సంబంధించిన మూడు అంశాలకు మేయర్ ముందస్తు ఆమోదం తెలపడంపై సభ్యులు అభ్యంతరం తెలుపుతూ వాయిదా వేయాలని కోరారు. దీంతో వాటిపై నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి కౌన్సిల్ సమావేశమై ఎజెండాలోని మిగిలిన అంశాలపై చర్చిస్తామని మేయర్ ప్రకటించారు.

ఎక్కడ చూసినా చెట్ల వ్యర్థాలే!

మురళీనగర్, సెప్టెంబరు 22; మురళీనగర్‌లో ఈపీడీసీఎల్, జీవీఎంసీల మధ్య సమన్వయ లోపంతో పారిశుధ్య పనులు పక్కదారి పడుతున్నాయి. సబ్‌స్టేషన్ల నిర్వహణ సమయాల్లో చెట్లను కొట్టడంతో రోజుల తరబడి కొమ్మలు, మోడులు, చెత్తకుప్పలుగా తయారైనా సిబ్బంది స్పందించడం లేదు. మురళీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్కడ కొట్టిన చెట్లు అక్కడే, ఆయా ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరే ఎండిన స్థితిలో దర్శనమిస్తున్నాయి. ఇలాంటిచోట పొరపాటున అగ్ని రాజుకుంటే పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ముప్పు పొంచి ఉన్నా సబ్‌స్టేషన్ ఇంజనీరు, సహాయక సిబ్బంది, క్షేత్రస్థాయి జీవీయంసీ, కరెంటు ఆఫీసు సిబ్బందికి పట్టడం లేదు. ముప్పు వాటిల్లకముందే వ్యర్థాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఆనుకొనే ఎన్‌జీజీఓస్ కాలనీ దగ్గర స్కూళ్లు, అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. ఈ అపాయాన్ని దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో పనిచేయాలని కోరుతున్నారు.

గీత కార్మికులకు వైన్‌షాపులు కేటాయింపుపై హర్షం



ఐటీ శాఖా మంత్రి నారాలోకేశ్‌ను కలసి ధన్యవాదాలు తెలుపుతున్న అంగటి రాము

ఆనందపురం, సెప్టెంబరు 25: కలుగీత కార్మికులకు పది శాతం మేర ప్రభుత్వ వైన్‌షాపులు కేటాయించడంపై గీత కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అంగటిరాము నోవాటెల్‌లో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం కలసి ధన్యవాదాలు తెలిపారు. బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీటవేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట పలువురు గీత కార్మిక సంక్షేమసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మంగమారిపేట తీరంలో కాసేపు లోకేశ్ విడిది

భీమునిపట్నం, సెప్టెంబరు 25: రాష్ట్ర హెచ్‌ఆర్‌డీ, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్, విశాఖ ఎంపీ శ్రీభరత్ బుధవారం రాత్రి భీమిలి బీచ్‌రోడ్ మంగమారిపేట తీరంలో ఫేకర్ గెస్ట్‌హౌస్‌లో కాసేపు గడిపారు. ముందుగా కాపులుప్పాడ గ్రేహౌండ్స్ సమీపంలోని ఆదాని డేటా సెంటర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి బీచ్‌రోడ్ గెస్ట్ హౌస్‌కు వచ్చారు. అక్కడికి ఆయన కుటుంబీకులు, బంధువులు పలువురు చేరుకోవడంతో సుమారు మూడు గంటలు వారితో ఆనందంగా గడిపారు. రాత్రి అక్కడే డిన్నర్ చేశారు.

ఆధ్యాత్మిక తత్వవేత్త ఆచార్య సచ్చిదానందమూర్తి



సచ్చిదానందమూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 25: పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి ఆధ్యాత్మిక తత్వవేత్త అని అధిక నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య పి. జార్జ్‌విక్టర్ అన్నారు. సచ్చిదానందమూర్తి శత జయంతి ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.జార్జ్‌విక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యాసం చేశారు. వైదిక సాంప్రదాయం, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతల్లో సర్వమానవ సౌభ్రాతృత్వంపై ఆచార్య సచ్చిదానంద మూర్తి ప్రతిపాదించిన విప్లవాత్మక వేదాంతంను ఆయన వివరించారు. ఉపనిషత్తులు ప్రతిపాదించిన 'తత్వమసి, అహం బ్రహ్మాస్మి' మహాకావ్యాలు, భగవద్గీతలో పేర్కొన్న పలు అంశాలను ఈ సందర్భంగా ఉటంకిచారు. ఈ కార్యక్రమంలో పూర్వాచార్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 54, టమాటా 46, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 56, బెండకాయలు 26, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 42, ఆనపకాయలు 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజ్ 28, క్యారెట్ 38, దొండకాయలు 38, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 86, అల్లం (పాతది) 90, బరబాటి 48, ముల్లంగి 38, నిమ్మకాయలు (కిలో) 100, గోరుచిక్కుడు 40, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 40, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 54, కంద 64, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 50, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 72, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 100, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	-- 98
ఫారం ధర	-- 118
విత్ స్కిన్	-- 206
స్కిన్‌లెస్	-- 216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

దసరాకు అప్పన్న తిరువీధి ఉత్సవం జరిగేనా?

» అసంపూర్తి బీఆర్‌టీఎస్ రహదారి పనులతో సందిగ్ధం

సింహాచలం, సెప్టెంబరు 25: కొండదిగువ సింహాచల గ్రామంలో నిర్వహించాల్సిన సింహాద్రినాథుని దసరా తిరువీధి ఉత్సవం ఈసారి జరుతుందా... లేదా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదిలో నాలుగుసార్లు ఉత్సవం నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఏటా ఆశ్వీయుజమాస శుక్లపక్ష దశమి విజయదశమిరోజున అప్పన్నస్వామి మెట్లమార్గంలో కొండదిగువకు చేరుకుని పూదోటలో శమీపూజ ఉత్సవాన్ని జరిపిన తరువాత గ్రామాల ప్రధాన మూడు మాడవీధుల్లో తిరువీధి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తిరువీధి ప్రధానకూడలి పుష్కరిణి సత్రం ప్రాంగణంనుంచి రాజవీధి, కోమటిమీధి, మధ్యవీధి, పోస్టాఫీసు మీదుగా సాగి కుమ్మరివీధి కూడలి నుంచి తొలిపావంచా వరకు వెళ్లి తిరిగి సింహగిరికి చేరుకోవటంతో పూర్తవుతోంది. తొమ్మిది నెలల క్రితం బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ రెండవ ఫేస్ పనులు ప్రారంభినప్పటికీ కుమ్మరివీధి కూడలిలోని లింక్ రోడ్డు నేటి వరకు పూర్తి చేయలేదు. దాంతో తిరువీధి ఉత్సవంపై స్థానిక భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు బీఆర్‌టీఎస్ పనులను పట్టించుకోకుండా వదిలేశారు. కుమ్మరివీధి కూడలి రోడువద్ద వేసిన తాత్కాలిక రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతగురైంది. కనీసం ద్విచక్ర వాహనాలు లేదా సాధారణ పాదచారులు నడిచేందుకు కూడా వీలులేని పరిస్థితి. ఈ స్థితిలో తక్షణం జీవీఎంసీ లేదాసింహాచల దేవస్థానం అధికారులు ఈ రోడ్డును పక్కాగా నిర్మించి అప్పన్నస్వామి దసరా తిరువీధి ఉత్సవానికి ఆటంకాలు తొలగించాలని భక్తులు కోరుకుంటున్నారు.



కోతకు గురై అస్తవ్యస్తంగా మారిన రహదారి

వందరోజుల కూటమి పాలనలో హామీల అమలు

» వాడవాడలా 'ఇది మంచి ప్రభుత్వం'పై ప్రచారం » ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ



శ్యామ్‌నగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న జడ్పీ ప్రేమ ప్రసన్న వాణి

మధురవాడ, సెప్టెంబరు 25: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వంద రోజుల వ్యవధిలోనే ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి ఇది మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్నట్టు కూటమి నాయకులు అన్నారు. శ్యామ్‌నగర్ , బైలర్స్‌కాలనీలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు కార్యదర్శి కానూరి అచ్చుతరావు, నాయకులు మామిడి దుర్గారావు, కుమార్, బండయ్య తదితరులు ఈ మేరకు కరపత్రాలు పంపిణీ చేశారు. శ్రీనివాస్‌నగర్, స్వతంత్రనగర్ కాలనీల్లో 7 వ వార్డు జనసేన నేత నాగోతి నరసింహనాయుడు, ఇల్లపు వెంకటేష్,శంకాబత్తుల సతీష్ తదితరులు ప్రచారం చేశారు.

పెదవాల్తేరు: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం 20వ వార్డు అధ్యక్షుడు బైరెడ్డి పోతన్న రెడ్డి అధ్వర్యం లో బుధవారం పెదవాల్తేరు తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పెదవాల్తేరు గాంధీ బొమ్మ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. సందర్భంగా పోతన్న రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16,437 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ, అన్న క్యాంటీన్లను ప్రారంభించినట్టు చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు, పంచాయతీలకు నిధులు వి డుదల చేస్తున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్యలక్ష్మి, మరడ సీతన్నరెడ్డి, కంబాపు శివారెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు కె.నగరపాలెం సచివాలయంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, జోనల్ కమిషనర్ పి.ప్రేమ ప్రసన్న వాణి మాట్లాడుతూ, వంద రోజులలో ప్రభుత్వం పరంగా వార్డులో చేపట్టిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. టీడీపీ నాయకుడు పోతిన అప్పలరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతిన సాంబ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

పద్మనాభం(రూరల్): మండలంలోని మద్ది, తునిపాలెం గ్రామాల్లో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వందరోజుల్లో ప్రభుత్వం చెపట్టిన ప్రభుత్వ పథకాలను వివరించారు. స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు కాళ్ల నగేష్ కుమార్, కార్యకర్తలు బుగత శ్రీనివాసరావు, (బుజ్జి), బుగత ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయాలి: సీఐటీయూ

ఆరిలోవ, సెప్టెంబరు 25: కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే నినాదంతో ఈ నెల 30 వ తేదీన జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఇందిరాగాంధీ జూ పార్కులో కాంట్రాక్ట్ వర్కర్స్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్ తదితర ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేంద్రకుమార్, ఎ. రమణ, జూపార్కు యూనియన్ నాయకులు నరేష్, రాజు, నరసింగరావు, పైడిరాజు, దిలీప్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపాలను వినియోగంలోకి తీసుకురావాలి

సింహాచలం, సెప్టెంబరు 25: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆదేశాలపై దేవస్థానం రూ. 12కోట్లు వెచ్చించి శ్రీనివాసనగర్ వద్ద నిర్మించిన నాలుగు కల్యాణమండపాల కాంప్లెక్స్‌ను తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని మాజీ పాలకమండలి అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు దేవస్థానం ఈఓను కోరారు. ఈ మేరకు బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే, వరాహ పుష్కరిణి వద్ద ప్రత్యేక ఘాట్ల నిర్మాణాలు, గ్రామదేవత బంగారమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు.

భీమిలి ఎంపీడీవోగా హనుమంతరావు

భీమునిపట్నం, సెప్టెంబరు 25: భీమిలి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎన్.హనుమంతరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం డివిజన్ నాతవరం ఎంపీడీవోగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. కాగా, ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన డా.జానకి ఆనందపురం బదిలీపై వెళ్లారు. దీంతో హనుమంతరావుకు కార్యాలయం ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



బాధ్యతలు స్వీకరించిన హనుమంతరావు

'పండిట్ దీన్‌దయాళ్ సేవలు మరువలేం'



పండిట్ దిన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

భీమునిపట్నం, సెప్టెంబరు 25: సమాజాభివృద్ధికి మానవతా వాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన దివంగత భారతీయ జన సంఘ్ అధ్యక్షుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ సేవలు మరువలేనివని బీజేపీ భీమిలి జోన్ 3వ డివిజన్ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత అన్నారు. బుధవారం స్థానిక చిన్నబజారు జంక్షన్‌లో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ నియోజకవర్గ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు ఆయన సేవలు వివరించారు. కార్యక్రమం అనంతరం, చిన్నబజారు వద్ద అన్న క్యాంటీన్‌లో ఆయన పేరిట మధ్యాహ్నం భోజనాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పికొండ ఆదినారాయణ, పోతిన జీవన్‌సంతోష్ పాల్గొన్నారు.

పెదవాల్తేరు: పండిట్ దిన్ దయాళ్ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ పాలన చేస్తున్నారని బీజేపీ నాయకులు టి. సుబ్బరామిరెడ్డి అన్నారు. నగర బీజేపీ కార్యాలయంలో దిన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ఫూర్తి ప్రదాత, దేశ భక్తుడు దిన్ దయాళ్ ఉపాధ్యాయ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనేశ్వరరావు,దిలీప్ వర్మ, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత, జిల్లా ఉపాధ్యక్షురాలు చొక్కాకుల జగదీశ్వరి, ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలు తొలగించాలి

కొమ్మాది, సెప్టెంబరు 25: గ్రేటర్ 5వవార్డులోని బొట్టవానిపాలెం వెంపలచెరువు, నగరంపాలెం రాళ్లచెరువులు ఆక్రమణకు లోనుకాకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ మొల్లిహేమలత బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మేయర్ హరివెంటకకుమరికి విజ్ఞప్తి చేశారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణగోడలు నిర్మించాలని, మెట్ల మార్గాలు నిర్మించాలన్నారు.

వార్డులో తాగునీరు, వీధిలైట్లు, కాలువలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అయోధ్యనగర్‌లో మౌలికవసతులు కల్పించాలన్నారు. అనంతరం కమిషనర్ సంపత్ కుమార్‌కు వినతి ప త్రమిచ్చారు.

8వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టండి

ఎండాడ: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని పలు సమస్యలతోపాటు, అభివృద్ధి పనులపై జీవీఎంసీ కమిషనరు సంపత్‌కుమార్‌కి కార్పొరేటర్ లొడగల అప్పారావు వినత పత్రం సమర్పించారు. తీర ప్రాంతాల్లో పర్యాటకుల ప్రాణాలు కాపాడుతున్న బీచ్ లైఫ్‌గార్డ్స్ , జీవీఎంసీ తాగునీటి విభాగం, శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు.

ఆరిలోవ: గ్రేటర్ 10వ వార్డు పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేపట్టాలని బుధవారం జరిగిన జీవీఎంసీ సమావేశంలో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి కోరారు. విద్యుత్ లైట్లను బాగు చేయాలని, కాలువలు, తాగునీటి కుళాయిల సమస్యలను ఆమె సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

ఘనంగా ఫార్మాసిస్టుల దినోత్సవం

వెంకోజీపాలెం, సెప్టెంబరు 25: ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఆర్‌కే బీచ్ నుంచి పామ్ బీచ్ హోటల్ వరకు ఏయూ ఫార్మసీ కళాశాల, దాని అనుబంధ కళాశాలల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. దాదాపు 450 మంది విద్యార్థులు పాలొన్నారు. ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు ఈ ర్యాలీని ప్రారంభించగా ప్రిన్సిపాల్ ఆచార్య జి.గిరిజాశంకర్, అధ్యాపకులు, పరిశోధనా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ఫార్మసీ కళాశాలలో..

తగరపువలస: తగరపువలస అవంతి ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫార్మాసిస్టుల వేడుకను కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతివెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మాసిస్టులు వైద్యులతో సమానమని అన్నారు. వివిధ దేశాల్లో పనిచేస్తున్న ఫార్మసిస్టుల్లో అత్యధికులు భారత్‌లో శిక్షణ పొందుతున్నవారేనని అన్నారు. ఈ సమావేశానికి ప్రిన్సిపాల్ ఎం.వి.వి.రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎంఎస్ లేబొరేటరీస్ డైరెక్టర్ జగదీశ్వరరావు, ఏయూ ఇన్క్యుబేషన్ సెంటర్ సమన్వయకర్త రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. పోస్టర్ ప్రెజెంటేషన్ ఇతర కార్యక్రమాలను నిర్వహించారు.



ర్యాలీని నిర్వహిస్తున్న కళాశాలల విద్యార్థులు

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

» రైతు శిక్షణ కేంద్రం అధికారి సుబ్రహ్మణ్యం

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబర్ 25: మండల పరిధి మజ్జివలస గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు శిక్షణ కేంద్రానికి చెందిన డా. సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేసి వరిలో తెగుళ్ల నివారణకు సూచనం దించారు. మండలంలో సుడిదోమ ఎక్కువగా ఉందని, నివారణకు రైతులు ఎసిపేట్ 400 గ్రాములు చొప్పున ఎకరానికి పిచికారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో బి. శివకోమలి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కాంతికిరణ్, వ్యవసాయసంచాలకులు విజయప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పద్మనాభం (రూరల్): వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని ఏవో ఎం.వెంకట సింహాచలం అన్నారు. బుధవారం పొట్నూరు, రెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన మందులు వాడకుండా సేంద్రియ పంటలసాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ లక్ష్మణరావు, స్థానిక నాయకులు నందీశ్వరరావు, ఆదిబాబు, దామోదరావు తదితరులు పాల్గొన్నారు.


బోణీ చందక గ్రామాలలో పొలం పిలుస్తోంది

ఆనందపురం: మండలంలోని బోని, చందక గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏటీఎంఏ ఆశాదేవి పొలం పిలుస్తుంది ఆవశ్యకత రైతులకు వివరించారు. భీమిలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్ మాట్లాడుతూ వరిలో సుడి దోమ నివారణకు తూడికాడ కషాయం తయారీని వివరించారు. పొడతెగులు నివారణకు శొంఠి కషాయం ఉపయోగించాలని సూచించారు. జిల్లా ఉద్యాన వన అధికారి కె.సత్యనారాయణరెడ్డి కూరగాయల సాగు విధానం వివరించారు. ఏవో సీహెచ్ సంధ్యారత్నప్రభ మట్టి నమూనాల ఫలితాలపై వివరించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

సింహాచలం, సెప్టెంబరు 25: వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణోత్సవం నేత్ర పర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా బుధవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల న డుమ జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు కావించి అక్షితారోపణ (తలంబ్రాలు) వేడుకగా జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

బీఆర్‌టీఎస్ నిర్వాసితులకు టీడీఆర్‌లు జారీచేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ నరసింహం

సింహాచలం, సెప్టెంబరు 25: గ్రేటర్ 98వ వార్డు తొలిపావంచా నుంచి పాత అడివివరం కూడలి వరకు గల బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ నిర్వాసితులకు తక్షణం టీడీఆర్‌లు జారీ చేయాలని కార్పొరేటర్ పివి నరసింహం కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. గతేడాది నవంబరులో ఆఘమేఘాల మీద నివాసాలను, వ్యాపార సంస్థలను ఖాళీ చేయించి, వాటిని తొలగింపు చేపట్టారన్నారు. దాంతో కొన్ని ఇళ్లు పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా కోల్పోయారన్నారు. ఆ విధంగా కోల్పోయిన 267మంది నిర్వాసితులకు నిబంధనల మేరకు అందాల్సిన టీడీఆర్‌లు జారీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులందరికీ ఒకేలా రూ.35వేల చొప్పున నాలుగు టీడీఆర్‌లు ఇచ్చేందుకు గత ప్రభుత్వ హ యాం లో ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈవీఎం గొడౌన్‌ల తనిఖీ



ఈవీఎంల పరిశీలనలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ప్రజా ప్రతినిధులు

ఆరిలోవ, సెప్టెంబరు 25: జీవీఎంసీ చినగదిలి మండల రెవెన్యూ కార్యాలయ సమీపాన ఉన్న ఈవీఎం గోదాంలను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ బుధవారం ఉదయం తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా ఆయన వివిధ పార్టీల ప్రతినిధులతో కలసి సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాంలోన ఉన్న వీవీ ప్యాట్‌లను ఇతర సామ గ్రిని పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఆయన వెంట ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రేవిడిలో చెకుముకి పరీక్ష

పద్మనాభం(రూరల్), సెప్టెంబరు 25: మండలంలోని రేవిడి వెంకటాపురం జడ్పీ స్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఉదయం శాస్త్రీయ విజ్ఞానంపై (చెకుముకి) పరీక్షలు నిర్వహించినట్టు హెచ్‌ఎం వి.శంకరరావు తెలిపారు. ఈ పరీక్షలకు 102 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందేందుకు ఈ పరీక్ష దోహపడుతుందని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు జి.శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, జి.సింహాచలం, కె.ఆదిలక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు.

భీమునిపట్నం (రూరల్): మండలంలోని చిప్పాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం చెకుముకి పరీక్ష నిర్వహించారు. వందమంది విద్యార్థులకు 40 ప్రశ్నలతో కూడిన పత్రాలను అందించి వాటిని పూర్తి చేయించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షల్లో గెలుపొందిన వారికి అక్టోబర్ 1న మండలస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు ఎంపీటీ రత్నం, రేక అప్పారావు తెలిపారు.

కొండచిలువ కలకలం



పట్టుకున్న పాముతో అపార్టుమెంట్ వాసులు

సాగర్‌నగర్, సెప్టెంబరు25: సాగర్ నగర్ జూపార్కు ప్రహరీ సమీపంలో ఉన్న ఓ అపార్టుమెంట్ (హర్షాటవర్)వద్ద కొండచిలువ బుధవారం కలకలం రేపింది. ఈభవనం వద్దనున్న మైదానం నెట్‌లో కొండచిలువ చిక్కుకుంది. దీంతో స్థానికులు ఆందోళనకు లోనయ్యారు. సమాచారం మేరకు స్నేక్‌సేవర్ సొసైటీకి చెందిన కిరణ్‌కుమార్ వచ్చి చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నాడు. అడవిలో విడిచిపెట్టారు. పాములు కనిపిస్తే చంపవద్దని సమాచారం ఇవ్వాలని ఈసందర్భంగా ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎంవీపీకాలనీ, సెప్టెంబరు 25: గ్రేటర్ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు అంజయ్యనగర్‌లో అభివృద్ధి పనులకు కార్పొరేటరు గొలగాని మంగవేణిపోలారావు బుధవారం శంకుస్థాపన చేశారు రూ. 2.5 లక్షల జీవీఎంసీ నిధులతో ఈ ప్రాంతంలో కుళాయిల కోసం పైపులైన్లు వేయనున్నారు. ఈ పనుల పూర్తయిన వెంటనే కుళాయి కనెక్షన్లు ఇస్తామని కార్పొరేటరు తెలిపారు. కార్యక్రమంలోటీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లను స్వాధీనం చేసుకున్న వీఎంఆర్‌డీఏ

సాగర్‌నగర్, సెప్టెంబరు 25: బకాయిలున్న రెండు వుడా ఇళ్లను వీఎంఆర్‌డీఏ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. 1992లో సాగర్‌నగర్ వుడా కాలనీలో ఈ ఇళ్లను ఎలాట్ చేశారు. అప్పటినుంచి వీటి యజమానులు నిబంధనలు ప్రకారం బకాయిలు చెల్లించలేదు. దీంతో హెచ్‌ఐజీ టు , హెచ్‌ఐజీ 1ఏ గృహాలను సంబంధిత అధికారి ఎం. విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో వేలం నిర్వహించి కొత్తవారికిపై ఇళ్లను కేటాయించనున్నట్టు ఆమె తెలిపారు.

లేడీస్ పిక్నిక్ పోస్టర్ ఆవిష్కరణ

సిరిపురం, సెప్టెంబరు 25: లేడీస్ పిక్నిక్ పోస్టర్‌ను బుధవారం నొవాటెల్ హోటల్‌లో ఆవిష్కరించినట్టు ఈవెంట్ మేనేజర్ వీరుమామ తెలిపారు. వైజాగ్ వుమెన్ ఫోరం, వుమెన్ కాంటెస్ట్ అండ్ ఈవెంట్స్‌ను వైజాగ్ ఆక్టివ్ వుమెన్ ఆధ్వర్యంలో నవంబరు 9న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఇందులో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అందాల పోటీల విజేతలు సుశీల, సాక్షిబజాజ్, పద్మిని, వర్ధిని, చిన్మికా, సంధ్యా, మమతా చౌదరి, రజనీ, శైలజ, రేఖాభోజ్, ఝాన్సీ, పద్మజ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు



పృథ్వీరాజ్ (ఫైల్)

ఎండాడ, సెప్టెంబరు 25: యువకుడి అదృశ్యంపై పీఎంపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలివి.. మారికవలసలోని ఆర్‌జీకే కాలనీకి చెందిన అరిక పృథ్వీరాజ్ (19) కూలీ పనులు చేస్తుంటాడు. ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి ఆరిక శాంతి స్నేహితులను, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితంలేక పోయింది. దీంతో పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.